# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

15.2.2026 ఆదివారం sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 214 | పేజీలు : 11 Pages : 11 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









> తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. మెజారిటీ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసినప్పటికీ, స్పష్టమైన మెజారిటీ రాని 38 హంగ్ మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం సుదీర్ఘంగా సమీక్షించారు.

# హంగ్ మున్సిపాలిటీలపై 'హస్తం' నజర్

## మేయర్, ఛైర్మన్ పీఠాలే లక్ష్యంగా సీఎం వ్యూహం

- 38 హంగ్ మున్సిపాలిటీలపై ప్రత్యేక ఫోకస్
- స్వతంత్రులకు కాంగ్రెస్ గాలం
- కనీసం 20 కైవసం చేసుకునేలా కసరత్తు
- వడ్డేపల్లి ఫార్వర్డ్ బ్లాక్ కౌన్సిలర్లతో సీఎం భేటీ
- ఆయారామ్ గయారామ్‌ల హడావిడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** మున్సిపల్ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మా రుతున్నాయి. హంగ్‌గా నిలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలపై అనుసరించాల్సిన వ్యూహంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కనీసం 20కిపైగా హంగ్ మున్సిపాలిటీలను కైవసం చేసుకునేలా కసరత్తు చేయాలని మంత్రులు, పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ అ ధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, సీని యర్ నేతలతో శనివారం సీఎం సమావేశమయ్యారు. రాష్ట్రవ్యా ప్తంగా హంగ్‌గా ఉన్న 38 మున్సిపాలిటీల పరిస్థితి, తదుపరి కార్యాచరణపై చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మ్యాజిక్ ఫిగర్

మిగతా 2 లో

# దేశాభివృద్ధికి క్యాబినెట్ 'మెగా' బూస్ట్

- రూ. 1.60 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఓకే!
- పీఎంఓ ఇకపై 'సేవతీర్థ్'..
- బ్రహ్మపుత్ర నది కింద భారీ అండర్ వాటర్ టన్నెల్
- తెలంగాణలో కొత్తగా 4 లైన్ల రహదారి..
- రైల్వే లైన్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ భేటీకి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. ప్రధానంగా ప్రధానమంత్రి కార్యాలయం పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. అలాగే రూ.1,60,504కోట్ల విలువైన పనులను చేపట్టాలని కేంద్ర సర్కార్ నిర్ణయించింది. అస్సాంలో అండర్ వాటర్ రివర్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రోహుపూర్-నుమాలిఘర్ మధ్య అండర్ వాటర్ రోడ్డు టన్నెల్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదించింది. 34 కిలోమీటర్ల మేర అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ టన్నెల్ నిర్మాణంతో 250 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. ఈ టన్నెల్ నిర్మాణం ద్వారా 6 గంటల సమయం పట్టే గమ్యస్థానాన్ని కేవలం 20 నిమిషాల్లోనే చేరుకునే అవకాశం ఉంది.

..4లో

# 'అది నకిలీ సమావేశం'

## రైతులతో రాహుల్ భేటీపై బీజేపీ విమర్శలు

రైతులతో రాహుల్ భేటీ.. నకిలీ సమావేశం అంటూ బీజేపీ నేతలు విమర్శించారు. రాహుల్ నిర్వహించిన మీటింగ్ కృత్రిమ మైనది, అలానే ఆధారం లేనిదంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

4



## రైతుభరోసా విడుదలకు
# రంగం సిద్ధం

**17 తేదీ ముహూర్తంగా నిర్ణయం..**

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా..**



2

ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని జమ చేయాలని నిర్ణయించింది.



# ముంబైలో కూలిన మెట్రో పిల్లర్

నలుగురు వ్యక్తులకు గాయాలు

3

# బీజేపీతో బీఆర్ఎస్ పొత్తులకు తెర

**తోక పార్టీలకే తోక పార్టీగా మారిన బీఆర్ఎస్**

## సీపీఐకి మద్దతే ఇందుకు నిదర్శనం

### మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత

3



మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తొనంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు.



# ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు కమాండోల మృతి..

ట్రక్కును ఢీకొన్న కోబ్రా కమాండోలు కారు

# కరీంనగర్ పీఠం బీజేపీదే



- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం
- ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు
- కేంద్రమంత్రి బండి సంజయ్

## మున్సిపల్ ఫలితాల ప్రభావం
# అసెంబ్లీపై ఉండదు



- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

3



## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

### నలుగురు కమాండోల మృతి..

### ట్రక్కును ఢీకొన్న కోబ్రా కమాండోలు కారు

**ఛత్తీస్‌గఢ్, ఫిబ్రవరి 14:** ఛత్తీస్‌గఢ్‌లోని ధమ్‌తారి జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం జిల్లాలోని ఖ్రిప్ బైపాస్‌పై ఆగి ఉన్న ట్రక్కును.. కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీ కొట్టడంతో నలుగురు కమాండోలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో కమాండో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నలుగురు కమాండోలు ఒకేసారి మృతి చెందడంతో రాష్ట్ర వ్యాప్తంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ధమ్‌తారి జిల్లాలోని ఖ్రిప్ బైపాస్‌పై ఆగి ఉన్న ఒక ట్రక్కును కోబ్రా కమాండోలు ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సెలవు మంజూరు చేసిన తర్వాత కమాండోలు జగదల్‌పూర్ నుంచి రాయ్‌పూర్‌కు వెళ్తుండగా.. ముందు వెళ్తున్న ట్రక్కును వారి కారు వెనుక వైపు బలంగా ఢీకొట్టింది. మృతులు ముఖేష్ కుమార్, ఉమేంద్ర సింగ్, రాజ్ కుమార్ గౌర్, డ్రైవర్ హీరాలాల్ నగర్‌గా గుర్తించారు. మరో కమాండో అభిమాన్ రాయ్‌గా గుర్తించారు.

## రైతుభరోసా విడుదలకు రంగం సిద్ధం

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే రైతులకు శుభవార్త చెప్పనుంది. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. యాసంగి సీజన్‌కు సంబంధించి.. రైతు భరోసా నిధుల విడుదలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎకరానికి రూ.6,000 చొప్పున అర్హులైన రైతులకు ఈ సాయాన్ని అందించనున్నారు. ఇందుకు ఫిబ్రవరి 17 తేదీని ముహూర్తంగా నిర్ణయం చేసినట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధుల విడుదలతో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించిన అంశాలపై సిఎం రేవతం చర్చించే అవకాశం ఉంది. అలాగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ ఎన్నికల విజయం తర్వాత కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రచిస్తోంది.

## ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యం

### కుటుంబ సభ్యుల తీవ్ర ఆందోళన

**హైదరాబాద్, ఫిబ్రవరి14 :** హైదరాబాద్ బాచుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. వికారాబాద్ జిల్లా యాలాల మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన పల్లె అనంతమ్మ (56) గత వారం రోజుల క్రితం ఈ హాస్పిటల్ నుంచి కనిపించకుండా పోయింది. ఇప్పటి వరకు ఆమె ఆచూకీ లభించలేదు. జనవరి 29న కిష్టాపూర్ గ్రామంలో హాస్పిటల్ సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత చికిత్స పేరుతో జనవరి 30న కంటి ఆపరేషన్ కోసం గ్రామస్తులను బస్సులో బాచుపల్లి హాస్పిటల్‌కు తరలించారు. కిష్టాపూర్ నుంచి 10 నుండి 15 మంది వెళ్లగా.. అంతా తిరిగి వచ్చారు. కానీ అనంతమ్మ మాత్రం తిరిగి రాలేదు. హాస్పిటల్ సీసీటీవీ ఫుటేజ్ పరిశీలనలో ఈ నెల 5వ తేదీన అనంతమ్మ హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లినట్లు తెలిసింది. హాస్పిటల్ నిర్లక్ష్యం వల్లే.. ఆమె బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే వారం రోజులు గడిచినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'మా అమ్మ మాకు కావాలి' అంటూ హాస్పిటల్ ముందు కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. 'మా అమ్మను ఎలా తీసుకొచ్చారో అలాగే అప్పగించాలి' అని అనంతమ్మ కొడుకు డిమాండ్ చేస్తున్నాడు. మహిళ ఆచూకీ లభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేట్టారు.

## ఫార్ములా-ఈ కార్ రేసులో కీలక పరిణామం

### ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు అనుమతి

**హైదరాబాద్,ఫిబ్రవరి14 :** ఫార్ములా–ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి లభించింది. ప్రాసిక్యూషన్ విషయంపై రాష్ట్రానికి కేంద్రం సమాచారం ఇచ్చింది. ఫార్ములా–ఈ రేసింగ్ ఒప్పందాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగిందని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ గతంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ని విచారించడానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అరవింద్ కుమార్ విషయంలో కేంద్రం అనుమతి ఇవ్వడంతో.. ఇప్పుడు ఏసీబీ ఆయనపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసేందుకు పూర్తి స్వేచ్ఛ పొందింది. కాగా, ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ ఉన్నారు.

## ఎక్స్ అఫీషియో సభ్యుల ఓటుపై ఈసీ స్పష్టత

**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** మున్సిపల్ పరోక్ష ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన జారీ చేసింది. మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓటుహక్కుపై స్పష్టతనిచ్చింది. తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం–2019 ప్రకారం.. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఇతర ఎక్స్‌అఫీషియో సభ్యులకు ఓటు హక్కు తప్పనిసరి అని తెలిపింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కానివారు ఓటు వేసేందుకు అనర్హులని సీఈసీ స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. మున్సిపల్ పరిధిలో ఓటరుగా నమోదు కాకుండా ఎక్స్‌అఫీషియో సభ్యులుగా ఓటువేసే వారిని అనర్హులుగా పరిగణిస్తారని, వారి ఓట్లు చెల్లవని న్యాయస్థానం తెలిపింది. ఈ నేపథ్యంలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సీఈసీ సర్క్యులర్ జారీ చేసింది. నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో స్థానిక ఓటు హక్కు ఉంటేనే ఎంపీలు, ఎమ్మెల్సీలు.. మేయర్/ఛైర్ పర్సన్ పదవుల ఎన్నికల్లో ఓటువేసి ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.

## హంగ్ మున్సిపాలిటీలపై 'హస్తం' నజర్

మొదటి పేజీ తరువాయి

దాటని మున్సిపాలిటీల్లో స్వతంత్ర కౌన్సిలర్ల మద్దతు కీలకమవుతుండటంతో వారిని ఆకర్షించే దిశగా చురుగ్గా ప్రయత్నాలు సాగిస్తోంది. ఎన్నికల్లో గెలిచిన పలువురు స్వతంత్ర అభ్యర్థులు తమకు అనుకూలమైన పార్టీల్లో చేరుతున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్ లావణ్య, ఇస్నాపూర్ 10వ వార్డు కౌన్సిలర్ రాహుల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. మరోవైపు నారాయణపేట 10వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ జయశ్రీ భాజపాలో చేరి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. నారాయణపేట మున్సిపాలిటీలో మొత్తం 24 స్థానాల్లో భాజపా 11 గెలుచుకోగా, స్వతంత్ర అభ్యర్థి చేరికతో బలం 12కి చేరింది. దీంతో ఛైర్‌పర్సన్ ఎన్నికలో ఎక్స్‌అఫిషియో ఓటు కీలకంగా మారనుంది.



### బెల్లంపల్లిలో బీఆర్ఎస్ బలం పెరుగుదల

బెల్లంపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, భాజపాకు చెందిన ఒక కౌన్సిలర్ మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ మొత్తం 34 స్థానాల్లో కాంగ్రెస్‌కు 14, బీఆర్ఎస్‌కు 14, స్వతంత్రులకు 5, భాజపాకు 1 స్థానం లభించాయి. తాజా చేరికలతో బీఆర్ఎస్ బలం 17కు చేరింది. ఈ నెల 16న ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు.

### వడ్డేపల్లి కౌన్సిలర్ల భేటీ

జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన ఎనిమిది మంది కౌన్సిలర్లు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డేపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో కౌన్సిలర్లు కుర్వ పావని, శారద, మంజుల, యుగేందర్‌రెడ్డి, దేవమ్మ, విజయ్‌భాస్కర్, జయశ్రీ, తిమ్మప్ప సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తాము కాంగ్రెస్ పార్టీలో చేరలేదని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే సీఎంను కలిసినట్లు స్పష్టం చేశారు. అభివృద్ధికి సహకరిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. మొత్తం మీద హంగ్ మున్సిపాలిటీల్లో స్వతంత్రుల పాత్ర కీలకంగా మారగా, ఛైర్మన్ ఎన్నికల ముందు రాష్ట్ర రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

## లాయర్ స్వప్న కేసులో నిందితుల అరెస్ట్

- హత్యకు ఉప యోగించిన కార్లు, ఫోన్లు స్వాధీనం
- భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసుల వెల్లడి





**రంగారెడ్డి, ఫిబ్రవరి 14:** మొయినాబాద్ కేతిరెడ్డిపల్లిలో న్యాయవాది స్వప్న హత్య కేసులో పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. చేవెళ్ల కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ గోటికె స్వప్న ఫిబ్రవరి 4న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. న్యాయవాది స్వప్న హత్యకు భూ వివాదమే కారణమని నిర్ధారించారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులలో ప్రధాన నిందితుడు స్వప్న సొంత అన్న గోటికె రాజు మరో ముగ్గురు సహచరులతో కలిసి హత్యకు కుట్ర చేసినట్లు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డీసీపీ యోగేష్ గౌతమ్ చెప్పారు. సర్వే నంబర్ 339లోని 4 ఎకరాల భూమిపై వివాదం. భూమి సర్వే కోసం వెళ్లిన సమయంలో నిందితులు స్వప్నపై దాడికి పాల్పడ్డారు. మొదటగా కారుతో ఢీకొట్టి, తర్వాత రాళ్లు,కర్రలతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతు కోసి హత్య చేశారు. దీంతో ఘటన స్థలంలోనే స్వప్న మృతి చెందింది. హత్య అనంతరం ఇన్నోవా కార్, స్కూటీలో నిందితులు పరారయ్యారు. ఇన్నోవా కారు, స్కూటీ సీజ్ చేశారు. నలుగురు నిందితుల మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కొడవలిని కూడా సీజ్ చేశాం అని డీసీపీ యోగేష్ తెలిపారు.చెల్లిని చంపిన సొంత అన్న కేసులో మరో వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పటికే స్వప్న అన్న రాజుతో పాటు ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. స్వప్న లొకేషన్ వివరాలు ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే మరో వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. గతంలోనూ రెండు సార్లు స్వప్నను హత్య చేసేందుకు ప్రయత్నించినట్టు రాజు విచారణలో ఒప్పుకున్నాడు. ఒకసారి కారుతో మరోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీ కొట్టించే ప్రయత్నం చేశాడు రాజు. హత్య చేసి రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్లాన్ చేశాడు. రెండు ఘటనల నుంచి స్వప్న తప్పించుకుంది. సీసీ కెమెరాలు లేని ప్రదేశాలు చూసి స్వప్నను వెనుక నుంచి ఢీ కొట్టేందుకు రాజు ప్లాన్ చేశాడు. ప్లాన్ సక్సెస్ చేసేందుకు తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. ఈ రోడ్డు ప్రమాదం కేసులను హత్యాయత్నం కేసులుగా పోలీసులు మార్చనున్నారు.

## అత్తాపూర్‌లో అడ్వకేట్ దారుణ హత్య

### కిరాతకంగా హత్య చేసిన బావమరుదులు


**హైదరాబాద్,ఫిబ్రవరి14:** నగరంలోని అత్తాపూర్‌లో అడ్వకేట్ మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యకు గురయ్యారు. సులేమాన్‌నగర్‌లోని తన సొంత ఆఫీసులో అడ్వకేట్‌పై కత్తులతో దాడి చేశారు. ఖదీర్‌ను మొదటి భార్య తమ్ముళ్లు అతి కిరాతకంగా చంపేశారు. పలుమార్లు కత్తితో పొడవడంతో తీవ్రంగా గాయపడిన ఖదీర్.. సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. దాడి జరిగిన వెంటనే నిందితులు పరారయ్యారు. అడ్వకేట్ ఖదీర్‌కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. రెండో పెళ్లి చేసుకోవడంతో.. ఖదీర్ మొదటి భార్య ఇంటికి రావడం మానేశాడు. ఈ కోపంతో బావ ఖదీర్‌పై.. ఇద్దరు బామ్మర్దులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఖదీర్ ఆఫీస్‌లో ఉన్న సమయంలో అక్కడకు వచ్చిన వారు.. మొదట రాడ్‌తో దాడి చేశారు. తలపై బలంగా కొట్టడంతో మహమ్మద్ ఖదీర్ కుప్పకూలిపోయాడు. ఆపై కత్తులతో ఆరుసార్లు పొడిచారు. దీంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు.. తక్షణమే ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఆధారాల సేకరిస్తోంది. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. అడ్వకేట్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.



## స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం

### పోలీసుల మెరుపు దాడిలో 45మంది అరెస్ట్

**హైదరాబాద్,ఫిబ్రవరి14:** కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ పరిధిలో స్పా సెంటర్ల పేరుతో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని గాయత్రి రెసిడెన్సీలో ఉన్న 'ఆసన వెల్నెస్ స్పా' సెంటర్‌లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 15 మంది యువతులను, 30 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు నిర్వాహకులు కాగా, మిగిలిన 27 మందిని విటులుగా గుర్తించి అందరిపై కేసులు నమోదు చేశారు. పోలీసుల విచారణలో ఈ దందాకు సంబంధించిన షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇర్ఫాన్ అనే వ్యక్తి గత ఏడాది కాలంగా ఈ స్పా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫుల్ బాడీ మసాజ్, అరోమా మసాజ్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షించి, లోపల నిబంధనలకు విరుద్ధంగా క్రాస్ మసాజ్ , వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలింది. ఈ ముఠాకు కూకట్‌పల్లి 9వ ఫేజ్‌లో కూడా మరో బ్రాంచ్ ఉన్నట్లు సమాచారం అందడంతో, పోలీసులు ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఈ రైడ్ సందర్భంగా నిందితుల నుంచి పోలీసులు 45 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్పా సెంటర్ల ముసుగులో ఇలాంటి అసాంఘిక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడ్డ యువతులను రెస్క్యూ హోమ్‌కు తరలించగా, నిర్వాహకులు , విటులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. నగరంలో ఇలాంటి అక్రమ సెంటర్ల జాబితాను తయారు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారు.



# కరీంనగర్ మేయర్ పీఠం బీజేపీదే

- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలను తిప్పికొడుతాం
- ప్రజాతీర్పును కాలరాసేలా కుట్రలు
- కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** అధికార పార్టీ కాంగ్రెస్‌తో బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తులు పెట్టుకొని భాజపాని మున్సిపల్ ఎన్నికల్లో ఓడించాలని చూసినా.. ప్రజలు మాత్రం తమని ఆశీర్వదించారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. అత్యధిక స్థానాలు చేజిక్కించుకున్న తామే కరీంనగర్ మేయర్ పీఠం పక్కా ప్లాన్‌తో వ్యూహాత్మకంగా దక్కించుకోబోతున్నామని స్పష్టం చేశారు. ప్రజల నిర్ణయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహరిస్తే.. వారి మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందం బయట పెడతానని తేల్చి చెప్పారు. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అనుసంధానకర్తగా ఎంఐఎం పనిచేస్తుందని ఆరోపించారు. కరీంనగర్‌లో కార్యకర్తల కష్టం, ప్రధాని మోదీ ఆశీస్సులతో గెలవడం సంతోషంగా ఉందని కేంద్రమంత్రి హర్షం వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు భాజపాలో చేరారని, మేయర్ పీఠానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ దాటేశామని వెల్లడించారు. మున్సిపల్ పీఠం ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఇప్పటివరకూ రూ. 1,400 కోట్ల పనులు చేశామని తెలిపారు. ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించినందుకు కరీంనగర్ ప్రజలకు బండి కృతజ్ఞతలు చెప్పారు. ఎంఐఎం రివైవల్ డే నిర్వహించడంపై కేంద్రమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేనికోసం రివైవల్ డే చేస్తున్నారని ప్రశ్నించారు. రజాకర్ల రాజ్యం తెస్తారా.. మహిళలను కించపరిచి బతుకమ్మ ఆడిస్తారా.. పాత రాజ్యం తెస్తామని ఎంఐఎం రివైవల్ డే చేస్తుందా? అని నిలదీశారు. వారి ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. ఎంఐఎం ప్రాబల్యం ప్రతి ఎన్నికల్లో తగ్గుతుందని, భాజపా బలపడుతూ వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భాజపా జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భాజపా అభ్యర్థుల విజయం పట్ల రాష్ట్ర పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# మున్సిపల్ ఫలితాల ప్రభావం అసెంబ్లీపై ఉండదు

- ఇవి స్థానిక రాజకీయాల ఆధారంగా జరిగినవే
- అయినా గణనీయంగా తమ బలాన్ని పెంచుకున్నాం
- మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాల ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ ఫలితాల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ఉండదని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫలితాలే దీనికి స్పష్టమైన ఉదాహరణ అని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గణనీయంగా మెరుగుపడిందని కేటీఆర్ తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్స్అఫీషియో ఓట్ల నమోదు విషయంలో సీఎస్, రాష్ట్ర ఎన్నికల సంఘంతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. బీఆర్ఎస్ 30 మున్సిపాలిటీలకు పైగా సులువుగా గెలుచుకుంటుందని అనుకున్నప్పటికీ, కొంత తగ్గిందని కేటీఆర్ అన్నారు. హంగ్ వచ్చిన ప్రాంతాల్లో కూడా పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా ఆశించిన మేర మున్సిపాలిటీలు రాలేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాల్లో మినహాయించి బీజేపీ ప్రభావం ఎక్కడా అంతగా లేదని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కాబట్టి అక్కడి పరిస్థితులను బట్టే పొత్తులు ఉంటాయని తెలిపారు. ఫార్ములా కేసులో ఏమీ లేదని ఏసీబీ అధికారులే చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఫార్ములా–ఈ, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు ఐదుసార్లు విచారణకు పిలిచారని, మళ్లీ పిలిస్తే వెళ్తానని చెప్పారు. ప్రభుత్వం అరెస్టు చేయాలనుకుంటే అరెస్ట్ అవుతానని ఆయన వ్యాఖ్యానించారు. సింగరేణి కార్మికులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలనే ఆలోచనతోనే కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తామని చెప్పినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# బీజేపీతో బీఆర్ఎస్ పొత్తులకు తెర

## తోకపార్టీలకే తోక పార్టీగా మారిన బీఆర్ఎస్

## సీపీఐకి మద్దతు ఇస్తామనడమే ఇందుకు నిదర్శనం

## జాగృతి అధ్యక్షురాలు కవిత



**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కంచుకోట ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ బలహీన పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయని అన్నారు. కమ్యూనిస్టులను తోక పార్టీగా అభివర్ణించిన బీఆర్ఎస్.. ఇప్పుడు సీపీఐకు మద్దతు ఇస్తానంటోందని వ్యాఖ్యలు చేశారు. తోక పార్టీలకే.. బీఆర్ఎస్ తోక పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. సీపీఐ అడగకుండానే.. కొత్తగూడెంలో సీపీఐకు కేటీఆర్ ఓపెన్ ఆఫర్ ఇవ్వటం దిగజారుడే అని చెప్పుకొచ్చారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను అసెంబ్లీలో కూనంనేని సాంబశివరావు ఎన్ని మాటలు అన్నారో కేటీఆర్‌కు గుర్తు లేదా అని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కూనంనేని ఆరోపణలను కేటీఆర్ ఒప్పుకున్నట్లేనా అని కవిత నిలదీశారు. కార్మికుల కోసం సీపీఐకు మద్దతు అంటోన్న కేటీఆర్ నయ వంచన చేసుకుంటున్నారని అన్నారు. అవసరం వచ్చినప్పుడు.. బీఆర్ఎస్‌కు కార్మికులు గుర్తొస్తారని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ఘోరంగా విఫలమైందని మున్సిపల్ ఫలితాలు చెప్తున్నాయన్నారు. మున్సిపాలిటీలను తీర్చిదిద్దానని చెప్పుకుంటోన్న కేటీఆర్.. ఇప్పుడేమంటారని ప్రశ్నించారు. ఈ స్థానాలు రావడమే ఎక్కువ అన్నట్లు కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటని విమర్శించారు. 'నేనే రాజు నేనే మంత్రి.. సీఎం పదవి ఆరు నెలలు బోనస్' అంటోన్న రేవంత్.. రైతుల బోనస్ గురించి మాట్లాడాలని కవిత డిమాండ్ చేశారు. జాగృతిపై కామెంట్స్ చేస్తోన్న వారికి చెప్తున్న.. ఇది జస్ట్ ట్రైలర్.. పిక్చర్ బాకీ హై' అని అన్నారు కవిత. కరీంనగర్ కార్పొరేషన్ కోసం బీజేపీ అష్టకష్టాలు పడుతోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో తప్ప బీజేపీ ఎక్కడా లేదన్నారు. సింగరేణి ఎన్నికల్లో కూడా ఏఐఎఫ్‌బీతో కలిసి జాగృతి పోటీ చేస్తుందని ప్రకటించారు. 40కి పైగా స్థానాల్లో జాగృతి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు కవిత. వడ్డేపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రలోభాలకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎవరికి మద్దతివ్వాలో స్థానిక జాగృతి నేతలు డిసైడ్ చేసుకుంటారని తెలిపారు. చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వ సొమ్ముతో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారని కవిత ఆరోపించారు. గతంలో 90 శాతం గెలిచిన బీఆర్ఎస్.. 17 సీట్లకు పడిపోవటం దారుణమన్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీకి మద్దతు ఇవ్వాలని బీఆర్ఎస్ ముందే డిసైడ్ అయిందని కవిత వ్యాఖ్యలు చేశారు.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

## కొత్తగూడెం మేయర్ పీఠం సీపీఐకి.. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్‌కు ఖరారు



**హైదరాబాద్, ఫిబ్రవరి 14:** తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంపై ఆయన మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సమావేశమై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచేలా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో నిర్వహించిన ఈ సమావేశంలో ఫలితాలపై విశ్లేషణతో పాటు భవిష్యత్ వ్యూహాలపై చర్చించారు. ముఖ్యంగా నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్లలో మేయర్ పీఠాలను దక్కించుకునే అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. మంచి ఫలితాలు సాధించిన మంత్రులు, పార్టీ నేతలను సీఎం అభినందించారు. రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని సీఎం పేర్కొన్నారు. "గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులను మా ప్రజా ప్రభుత్వం రెండేళ్లలో పూర్తి చేసింది. ప్రజల విశ్వాసమే ఈ విజయానికి పునాది" అని వ్యాఖ్యానించారు. ఎన్నికల విజయం ఆరంభం మాత్రమేనని, అసలు అభివృద్ధి ఇప్పుడే ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. హంగ్ పరిస్థితులు ఉన్న మున్సిపాలిటీల్లో వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని, అవసరమైన చోట మిత్రపక్షాలతో చర్చలు జరిపి పీఠాలను దక్కించుకోవాలని సూచించారు. నిజామాబాద్‌లో మేయర్ పీఠం కోసం మజ్లిస్‌తో చర్చలు జరపాలని పీసీసీ చీఫ్‌కు ఆదేశించారు. ఇదిలావుంటే, భద్రాద్రి కొత్తగూడెం కార్పొరేషన్ విషయంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. సీఎం రేవంత్ రెడ్డితో సీపీఐ రాష్ట్ర నేత పల్లా వెంకట్ రెడ్డి భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై చర్చించిన అనంతరం కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో మేయర్ పదవిని సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవిని కాంగ్రెస్‌కు కేటాయించేలా అవగాహనకు వచ్చారు. ఈ నెల 11న జరిగిన ఎన్నికల్లో మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్ 22, సీపీఐ 22, బీఆరెస్ 8, సీపీఎం 1, బీజేపీ 1, స్వతంత్రులు 6 స్థానాల్లో విజయం సాధించారు. స్వతంత్రుల్లో పలువురు కాంగ్రెస్ కూటమికి మద్దతు ప్రకటించడంతో కూటమి బలం 29కు చేరింది. దీంతో మేయర్ పీఠంపై ఉత్కంఠ నెలకొంది. అయితే బీఆరెస్‌కు చెందిన 8 మంది కార్పొరేటర్లు తాము పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. తాము అమ్ముడుపోయామంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని వీడియో ద్వారా వెల్లడించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ప్రజలకు సేవలందించే కేంద్రాలుగా మార్చాలని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. భవిష్యత్ ఎన్నికలకూ ఇదే స్ఫూర్తితో సిద్ధం కావాలని ఆయన సూచించారు.



# కరీంనగర్‌లో బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయం

## మేయర్ పదవి కోసం కాంగ్రెస్, ఎంఐఎంతో జట్లు

## తాజా పరిస్థితులపై ఆరా తీస్తున్న కేంద్రమంత్రి బండి

**కరీంనగర్, ఫిబ్రవరి 14:** కరీంనగర్‌లో మేయర్ పదవి కోసం ప్రధాన పార్టీల మధ్య రాజకీయ పరిణామాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. 'మేయర్' పదవి కోసం బీఆర్ఎస్ తన సిద్ధాంతాలను పక్కన పెట్టి కాంగ్రెస్, ఎంఐఎం కుమ్మక్కైనట్లు ప్రచారం సాగుతోంది. భారతీ–య జనతా పార్టీని ఓడించేందుకు మూడు పార్టీలు ఒక్కటైనట్లు సమాచారం. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి బీజేపీని ఓడించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇండిపెండెంట్ కార్పొరేటర్‌ను మేయర్ అభ్యర్థిగా నిలబెట్టేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు శుక్రవారం రాత్రి సదరు కార్పొరేటర్‌తో సమావేశమయ్యారు. అదే సమయంలో బీఆర్ఎస్ నేతలు కూడా కార్పొరేటర్‌తో రహస్యంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఇండిపెండెంట్లు, ఇతర కార్పొరేటర్లు, బీజేపీ సభ్యుల మద్దతు కోసం ఆఫర్లు ఇవ్వాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు మేయర్‌గా మద్దతిస్తే ఆర్థిక సహాయం కూడా అందిస్తానని కూడా ఆ ఇండిపెండెంట్ కార్పొరేటర్ సంప్రదింపులు జరుపుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలను కమలం పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. తమ పార్టీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేయడాన్ని ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్యగా బీజేపీ అభివర్ణిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మధ్య రహస్య ఒప్పందం ఉందని, ఇది ప్రజలను మోసం చేయడమేనని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ మొత్తం ఎపిసోడ్‌పై కేంద్రమంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ విపక్షాల డ్రామాలను ఆధారాలతో సహా ఎండగట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నట్లు సమాచారం. కరీంనగర్ మేయర్ పీఠం చుట్టూ జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక నగరానికి పరిమితం కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసేలా ఉన్నాయి. బండి సంజయ్ మీడియా సమావేశం తర్వాత ఈ వ్యవహారం మలుపులు తిరిగే అవకాశం ఉంది.

# కాంగ్రెస్ అక్రమాలతో గెలుపు

## మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలు: మాజీమంత్రి తలసాని



**సిద్ధిపేట, ఫిబ్రవరి 14:** మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ పలు దౌర్జన్యాలకు పాల్పడిందని, డబ్బులు, మద్యం ఏరులై పారించిందని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్దాల పునాదులు మీద పుట్టి అన్ని దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అధికారం నడిపిస్తుందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుడ్డిలో మెల్లలాగా కాంగ్రెస్ గెలిచిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ధైర్యంగా పోరాటం చేసి గెలుపొందారని కొనియాడారు. రాజకీయ వ్యవస్థలో ప్రభుత్వాలు ఎపుడు కూడా శాశ్వతం కాదు. ప్రజలు శాశ్వతం. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ కి సరైన గుణపాఠం చెబుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఎక్కడ ఒక్క ప్రాజెక్ట్ నిర్మించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఫ్రీ టికెట్ పెట్టి పురుషులకు డబుల్ రెట్లు పెంచారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ఎన్నో అద్భుతాలు చూశారని, రాష్ట్రం సాధించడం ఒక్క అద్భుతమైన ఘట్టమని, తెలంగాణను అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అనేక ప్రాజెక్ట్ లు నిర్మించారని తెలిపారు. గతంలో నీరు, విద్యుత్ లేక రైతులు ఇబ్బంది పడ్డారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడితే కేసీఆర్ పంట సహాయం చేశారని గుర్తు చేశారు. తాను టీడీపీ లో ఉన్నపుడు 5గంటలకు మించి విద్యుత్ రాకపోయేదని వివరించారు. రియల్ ఎస్టేట్ రంగం కాంగ్రెస్ ప్రభుత్వంలో కుదేలయింది ని, కేసీఆర్ హయాంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటితే కాంగ్రెస్ హయాంలో భూముల ధరలు పడిపోయాయని అన్నారు. సిద్దిపేటను హరీష్ రావు బాగా అభివృద్ధి చేశారని ప్రశంసించారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్

## నైతిక విజయం తమదే అన్న వేముల



**నిజామాబాద్, ఫిబ్రవరి 14:** మామున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేసి గెలిచిందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలదే అని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలకు విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని దుర్వినయోగం చేశారని అన్నారు. రాత్రింబవళ్లు నోట్ల కట్టలు పంపిణీ చేశారని, మద్యాన్ని ఏరులై పారించారని ఆరోపించారు. కొన్నిచోట్ల రిగ్గింగ్ చేయడంవల్లే అక్కడ గెలిచారని తెలిపారు. అధికార బలాన్ని ఉపయోగించి ఎన్నికల్లో గెలిస్తే అది విజయం కాదని, ప్రజలు కాంగ్రెస్ పార్టీ తీరును గమనిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించామని కాంగ్రెస్ నాయకులు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ పార్టీ సాంకేతికంగా విజయం సాధించిందే తప్ప నైతికంగా గెలిచింది బీఆర్ఎస్ పార్టీ అని అన్నారు. కాంగ్రె స్ పార్టీ అధికార దుర్వినియోగం చేస్తూ, మద్యం, డబ్బులు, చీర లు పంపి ణీ చేసిందని, అన్ని అవాంతరాలను ఎదుర్కొని బీఆర్ఎస్ అభ్యర్థులు వీరోచితంగా పోటీలో నిలిచారన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓడినా, గెలిచినా తాము ఎప్పటికీ ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులకు బీఆర్ఎస్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం, మద్యం, డబ్బు పంపకాలతో కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని ఆరోపించారు. అయినప్పటికీ మెజార్టీ సీట్లు సాధించలేకపోయిందని తెలిపారు.




సంపాదకీయం

# తొలిదశ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగింపు

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తొలిదశ శనివారం ముగిసింది. రాజ్యాంగపరమైన ప్రక్రియలైన రాష్ట్రపతి ప్రసంగం, కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం వంటి కార్యక్రమాలు పూర్తయ్యాయి. అయితే దేశవ్యాప్తంగా ప్రాధాన్యం గల అనేక అంశాలపై సార్థకమైన చర్చలు జరగకపోవడం పట్ల రాజకీయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సమావేశాల్లో స్పీకర్ ఓం బిర్లా తీరుపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షం తమకు సరైన అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించగా, అధికార పక్షం మాత్రం నియమావళి ప్రకారమే సభను నడిపిస్తున్నామని స్పష్టం చేసింది. పార్లమెంట్ చరిత్రలో స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టడం అరుదైన పరిణామమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. బడ్జెట్ కేటాయింపుల విషయంలో కూడా ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. కొత్త సంక్షేమ కార్యక్రమాల కంటే పాత పథకాలకే ప్రాధాన్యం ఇచ్చారని, ఉపాధి, వ్యవసాయం, ధరల పెరుగుదల, యువత నిరుద్యోగం వంటి కీలక సమస్యలపై స్పష్టమైన చర్యలు కనిపించలేదని ఆరోపించారు. ప్రభుత్వం మాత్రం ఆర్థిక క్రమశిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా బడ్జెట్ రూపొందించామని వెల్లడించింది.

**రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అనేక జాతీయ అంశాలు ప్రస్తావనకు రావాల్సి ఉన్నప్పటికీ, విస్తృత స్థాయిలో చర్చ జరగలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యసభలో సమాధానం ఇచ్చినప్పటికీ, లోక్‌సభలో మరింత సమగ్ర సమాధానం అవసరమని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం పరిమితమైందని కాంగ్రెస్ సభ్యులు ఆరోపించారు. మరోవైపు, ఆయనపై అనర్హత ప్రతిపాదన తెరపైకి రావడం రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. దీనిని ప్రతిపక్షాలు కక్షసాధింపు చర్యగా అభివర్ణించగా, అధికార పక్షం మాత్రం సభా నియమాల ప్రకారమే వ్యవహరిస్తున్నామని తెలిపింది.**

అమెరికాతో వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్‌తో జరుగుతున్న చర్చలు, అంతర్జాతీయ వాణిజ్య విధానాల మార్పులు వంటి అంశాలపై పార్లమెంట్‌లో సవివర చర్చ అవసరమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందం కారణంగా దేశ రైతాంగం, చిన్న వ్యాపారులు ప్రభావితమవుతారన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దిగుమతులపై సుంకాలు తగ్గించే ప్రతిపాదనల వల్ల దేశీయ ఉత్పత్తిదారులకు నష్టం వాటిల్లవచ్చని కొన్ని వర్గాలు భావిస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే నిర్ణయాలే తీసుకుంటున్నామని స్పష్టం చేస్తోంది. దేశాన్ని ప్రభావితం చేసే కీలక విధాన నిర్ణయాల్లో పార్లమెంట్‌ను విశ్వాసంలోకి తీసుకోవడం ప్రజాస్వామ్య పరిపాలనలో ముఖ్యమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరుపక్షాలు పరస్పర ఆరోపణలకు పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై సార్థక చర్చలకు వేదికగా పార్లమెంట్‌ను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. మొత్తంగా, బడ్జెట్ సమావేశాల తొలిదశ రాజ్యాంగపరమైన ప్రక్రియలతో ముగిసినప్పటికీ, దేశ ప్రజలు ఆశించిన స్థాయిలో విధాన చర్చలు జరగలేదన్న భావన వ్యక్తమవుతోంది. రెండో దశ సమావేశాల్లో అయినా ముఖ్యమైన జాతీయ, ఆర్థిక, విదేశాంగ అంశాలపై సమగ్ర చర్చలు జరిగేలా ప్రభుత్వం‌ఉప్రతిపక్షాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.



# దేశాభివృద్ధికి క్యాబినెట్ 'మెగా' బూస్ట్

- రూ. 1.60 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఓకే!
- పీఎంఓ ఇకపై 'సేవతీర్థ్'.. బ్రహ్మపుత్ర నది కింద భారీ అండర్ వాటర్ టన్నెల్
- తెలంగాణలో కొత్తగా 4 లైన్ల రహదారి..
- రైల్వే లైన్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్



**ఢిల్లీ, ఫిబ్రవరి 14:** ప్రధానమంత్రి నరేందర్‌మోదీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర క్యాబినెట్‌సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమిచ్చేలా రూ.1,60,504 కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, అశ్విని వైష్ణవ్ తదితరులు హాజరయ్యారు. సమావేశంలో ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) పేరును 'సేవతీర్థ్'గా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజల సేవకు అంకితభావాన్ని ప్రతిబింబించేలా ఈ మార్పు చేపట్టినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈశాన్య భారత అభివృద్ధికి దోహదపడే కీలక నిర్ణయంగా అస్సాం రాష్ట్రంలో గోహుపూర్‌ఉనుమాలిఘర్ మధ్య బ్రహ్మపుత్ర నది కింద 34 కిలోమీటర్ల అండర్‌వాటర్ రోడ్ టన్నెల్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రైల్వే లైన్, నేషనల్ హైవే అవసరాలకు అనుగుణంగా నిర్మించనున్న ఈ టన్నెల్ ద్వారా సుమారు 250 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు, ప్రస్తుతం ఆరు గంటలు పట్టే ప్రయాణాన్ని కేవలం 20 నిమిషాల్లో పూర్తి చేసే వీలుంటుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా కసారాఉమన్మాడ్ మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఢిల్లీఉఅంబాల మధ్య అదనపు రైల్వే లైన్ల నిర్మాణానికి కూడా ఆమోదం లభించింది. బళ్లారిఉ హోస్పేట మధ్య రూ.2,372 కోట్లతో మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. తెలంగాణఉకర్ణాటక రాష్ట్రాల మధ్య రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచే దిశగా గూడె బేల్లూరు నుంచి మహబూబ్‌నగర్ సెక్షన్ వరకు రూ.3,175 కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి ఆమోదం లభించింది. హైదరాబాద్‌ఉపనాజీ కారిడార్‌లో భాగంగా 80 కిలోమీటర్ల మేర కొత్త నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టనున్నారు. దమాసియాఉబిటాడ నర్సాపూర్ మలోత సెక్షన్‌లో నాలుగు లైన్ల నిర్మాణానికి రూ.4,584 కోట్లు, గోతిఉత్రిమ్బక్‌ఉపాల్ఘర్ సెక్షన్ అభివృద్ధికి రూ.3,320 కోట్లు కేటాయించారు. కేంద్ర క్యాబినెట్ తీసుకున్న ఈ నిర్ణయాలతో దేశవ్యాప్తంగా రవాణా, రైల్వే, రహదారి మౌలిక సదుపాయాల రంగాలకు కొత్త ఊతం లభించనుందని కేంద్ర వర్గాలు పేర్కొన్నాయి.

# 'అది నకిలీ సమావేశం'

## రైతులతో రాహుల్ భేటీపై బీజేపీ విమర్శలు



**ఢిల్లీ, ఫిబ్రవరి14:** శుక్రవారం లోక్‌సభ ఆవరణలో రైతు సంఘాల నేతలతో కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సమావేశమైన సంగతి తెలిసిందే. పార్లమెంట్ భవన సముదాయంలో జరిగిన ఈ భేటీలో భారత్‌-అమెరికా వాణిజ్య ఒప్పందం, రైతులు, రైతు కూలీల జీవనోపాధిని కాపాడడంపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో రైతులతో రాహుల్ భేటీ.. నకిలీ సమావేశం అంటూ బీజేపీ నేతలు విమర్శించారు. రాహుల్ నిర్వహించిన మీటింగ్ కృత్రిమమైనది, అలానే ఆధారం లేనిదంటూ బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం 'ఎక్స్' వేదికగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వీడియోను రిలీజ్ చేశారు. 'రాహుల్ గాంధీ మరోసారి రంగస్థలం నిర్వహించాడు. ఆయన నిర్వహించిన సమావేశం అత్యంత కృత్రిమమైనదిగా ఉంది. అలాగే దీని ద్వారా నకిలీ కథనాన్ని బయటపెట్టారు. ఈ సమావేశంలో కొందరు కాంగ్రెస్ నేతలు రైతులుగా నటించారు. వారితో రాహుల్ గాంధీ నకిలీ సంభాషణ నిర్వహించారు. రైతుల ప్రయోజనాలను ప్రధాని మోదీ పూర్తిగా రక్షించినా కూడా.. అమాయకపు రైతులను తప్పు దోవ పట్టించేందుకు రాహుల్ గాంధీ, ఆయన స్నేహితులు ఇలాంటి నకిలీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరి నిజ స్వరూపాన్ని బయటపెడతాను' అని గోయల్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అబద్ధాలని, నిజమైన రైతులను ఆందోళనకు గురి చేస్తుందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. శుక్రవారం రాహుల్‌తో జరిగిన సమావేశంలో అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని రైతు సంఘాల నేతలు వ్యతిరేకించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, పండ్లు, పప్పు ధాన్యాల రైతుల బతుకుదెరువు.. ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఈ ఒప్పందంతో దేశంలోకి వ్యవసాయ దిగుమతులకు తలుపులు తెరుచుకుంటాయని.. ఇతర పంటలు కూడా భారత్‌లోకి ప్రవేశిస్తాయని రాహుల్ వారికి చెప్పారని కాంగ్రెస్ ఓ ప్రకటనలో వెల్లడించింది.




# హైవేపై దిగిన మోదీ విమానం

## చైనా సరిహద్దులో ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** అస్సాంలో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈశాన్య భారతంలో ఏర్పాటైన తొలి ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ (ఈఎల్‌ఎఫ్)పై ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ (పీ-130జీ) ల్యాండ్ అయింది. ఈ ఫెసిలిటీ చైనా సరిహద్దుకు 300 కి.మీ దూరంలో ఉంది. ప్రధాని మోదీ దీన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాయుసేన ప్రత్యేక విన్యాసాలు ప్రదర్శించింది. ఈ ఫెసిలిటీ గురించి మోదీ ఇప్పటికే ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. క్లిష్ట సమయంలో సహాయ కార్యకలాపాలకు, అత్యవసర ప్రతిస్పందనకు ఈ ఈఎల్‌ఎఫ్ కీలకమని పేర్కొన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో దిబ్రూగఢ్ ఎయిర్‌పోర్ట్, చబువా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లలో కార్యకలాపాలు నిర్వహించలేని పరిస్థితి ఉంటే.. ఈ ఈఎల్‌ఎఫ్‌ను ఒక ప్రత్యామ్నాయంగా వాడతారు. దాంతో సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు.. భారత వాయుసేన వేగంగా స్పందించేందుకు వీలవుతుంది. టేకాఫ్, ల్యాండింగ్‌కు అనుకూలంగా దీనిని డిజైన్ చేశారు. పశ్చిమ, ఉత్తర, మధ్య భారతంలో ఇప్పటికే ఈ ఈఎల్‌ఎఫ్‌లు ఉన్నాయి. చైనాతో సరిహద్దు వివాదాల వేళ దీన్ని ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యం

## కొనసాగుతున్న గాలింపు చర్యలు

**బెంగళూరు, ఫిబ్రవరి 14:** అమెరికాలో భారత విద్యార్థి అదృశ్యమయ్యాడు. కర్ణాటకకు చెందిన సాకేత్ శ్రీనివాసయ్య (22) ఫిబ్రవరి 9 నుంచి కన్పించకుండా పోయాడు. దీంతో అతడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాకేత్ బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుతున్నాడు. అతడు చివరిసారిగా క్యాంపస్‌కు కిలోమీటరు దూరంలో ఉన్న లేక్ అంజా సమీపంలో కన్పించినట్లు తెలుస్తోంది. అక్కడ అతడి పాస్‌పోర్టు, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాక్‌ప్యాక్‌లను అధికారులు గుర్తించారు. అతడిని గుర్తించేందుకు స్నేహితులతో కలిసి స్థానిక అధికారులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. సాకేత్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్నామని, వారికి అన్నివిధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చింది. అమెరికా అధికారులతోనూ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది.

# సుప్రీంకోర్టులో 'డాక్టర్' వాదన

## 19 ఏళ్ల యువకుడికి ఎంబీబీఎస్ సీటు ఖరారు!

**తన కేసును తానే వాదించి నెగ్గిన అథర్వ్..**

**'పది నిమిషాల' గడువుతో అద్భుతం**

**ఈడబ్ల్యూఎస్ కోటా అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** అత్యున్నత న్యాయస్థానంలో ఉద్ధండ పిండాల వంటి న్యాయవాదులు వాదనలు వినిపించే చోట, 19 ఏళ్ల ఓ యువకుడు అడుగుపెట్టాడు. ఎటువంటి న్యాయవాద అనుభవం లేకపోయినా, రాజ్యాంగ నిబంధనలను ఉటంకిస్తూ తన వాదనలతో ధర్మాసనాన్ని ముగ్ధులను చేశాడు. పది నిమిషాల పాటు తను కోరిన అదనపు సమయమే అతని జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ యువకుడే మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన అథర్వ్ చతుర్వేది.

### నీట్‌లో మెరిసినా దక్కని సీటు

లాయర్ మనోజ్ చతుర్వేది కుమారుడైన అథర్వ్‌కు డాక్టర్ కావాలనేది కల. నీట్ పరీక్షలో ఒకసారి కాదు, రెండుసార్లు ఉత్తీర్ణత సాధించాడు. 2025-26 సెషన్‌లో 530 మార్కులు సాధించినప్పటికీ, అతనికి ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో సీటు దక్కలేదు. దీనికి కారణం మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోటాను అమలు చేయకపోవడమే. అర్హత ఉన్నా అడ్మిషన్ దక్కకపోవడంతో అథర్వ్ న్యాయపోరాటం చేయాలని నిర్ణయించుకున్నాడు. మొదట జబల్‌పూర్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఏమాత్రం వెనకడుగు వేయకుండా స్వయంగా సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశాడు.

### సమయస్ఫూర్తి



విచారణ సమయంలో చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం ముందు అథర్వ్ తన వాదనలు వినిపిస్తూ.. మరింత స్పష్టత కోసం "పది నిమిషాలు అదనంగా కావాలి" అని కోరాడు. అథర్వ్ వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు, ఆర్టికల్ 142 కింద తన ప్రత్యేక అధికారాలను ఉపయోగించి అతనికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ విద్యాసంవత్సరంలోనే (2025-26) అథర్వ్‌కు ఎంబీబీఎస్ సీటు కేటాయించాలని నేషనల్ మెడికల్ కమిషన్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, అథర్వ్‌పై న్యాయమూర్తులు ప్రశంసలు కురిపించారు. "నీవు డాక్టర్ కావాలనుకుంటున్నావా! లేక లాయరా?" అని జబల్‌పూర్ హైకోర్టు న్యాయమూర్తి గతంలో జోక్ చేసేంతగా అథర్వ్ వాదనలు ఆకట్టుకున్నాయి. సుప్రీంకోర్టు సైతం అతని ధైర్యాన్ని, చట్టంపై ఉన్న అవగాహనను అభినందించింది.

## పేకాటరాయుళ్లపై కేసు నమోదు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలం బోయకొండ గ్రామంలో పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేశ్వరరావు, తెలిపారు ఆయన కథనం మేరకు... చౌడేపల్లి మండలం బోయకొండ గ్రామంలో జగదీష్'కు చెందిన బిల్డింగ్'లో రెండవ అంతస్తులో ఉన్న సింగిల్ రూములో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుండి నగదు రూ 1,78,200లు తొమ్మిది సెల్ ఫోన్'లు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు మదనపల్లి, బెంగళూరు, ముల్బాగల్ ప్రాంతాలకు చెందినవారుగా వారిని గుర్తించామన్నారు

## ఎడ్ల పందాలనుప్రారంభం

**మాజీ ఎంపిటిసి. సైదా బాబు ...**



**నేటి సాక్షి చిలుకూరు:** చిలుకూరు మండల. బేతవోలు గ్రామం లో కనకదుర్గమ్మ జాతర శివరాత్రి పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభ రాజుల రెండో రోజు బండలాగుట ప్రదర్శన ను ప్రారంభించిన ఎంపీటీసీ సైదా బాబు పోలీస్ సిబ్బంది.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్ల పందాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు రెండో రోజు మూడో రోజులు శని ఆదివారం నాలుగు పళ్ళ ఎడ్ల విభాగం ఆరుపళ్ళ ఎడ్ల విభాగం ఆదివారం న్యూ కేటగిరి ఎడ్ల పందాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు జాతీయస్థాయి ఎడ్ల పందేలు లలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి నాగయ్య ఉప సర్పంచ్ ఏడుకొండలు మాజ ఎంపీటీసీ సైదా బాబు కాంగ్రెస్ నాయకులు వార్డు సభ్యులు పాల్గొన్నారు...

## బిజెపి పార్టీలో చేరిక......



**నేటి సాక్షి, నారాయణపేట్ ఇమామ్ సాబ్ :** నారాయణపేట పదవ వార్డ్ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన జయశ్రీ శనివారం నాడు భారతీయ జనతా పార్టీలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ పార్టీ అధ్యక్షులు రామచంద్ర రావు ఆధ్వర్యంలో చేరారు. పేట జిల్లా కేంద్రంలో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో స్వాతంత్ర అభ్యర్థిగా 10వ వార్డు నుండి పోటీలో గెలుపొందడం జరిగింది. బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు సమక్షంలో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ఆర్థిక సాయం

**ఉద్యోగ ఉపాధ్యాయ మిత్రమండలి**



**నేటి సాక్షి చిలుకూరు:** ఈ రోజు చిలుకూరు మండలం రామచంద్రానగర్ ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రమండలి రామినేని. కళింగ రావు(ఋత్రా) మరియు వసుకుల. రామారావు (GHM)గార్ల ఆధ్వర్యంలో అంకతి .నరసయ్య గారిని కలిసి స్వర్గీయ అంకతి నాగమ్మ గారి మరణం పట్ల సానుభూతి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రమండలి తరపున 75 kgs బియ్యం మరియు 40,500/- ఆర్థిక సహాయం గ్రామ పెద్దల సమక్షంలో అందించడం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగ,ఉపాధ్యాయ మిత్రమండలికి ధన్యవాదాలు తెలియజేశారు.

# మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సంచలనం



- త్రిముఖ పోటీలో 10 సీట్లతో కాషాయ దళం షాక్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు అనూహ్య ఫలితాలు

**నేటి సాక్షి - మెట్‌పల్లి, రాధారపు నర్సయ్య :** మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఊహించని ఫలితం వెలువడింది. త్రిముఖ పోటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు భారతీయ జనతా పార్టీ గట్టి షాక్ ఇచ్చింది. ఏకంగా 10 సీట్లను బీజేపీ కైవసం చేసుకుని పట్టణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. టికెట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించిన బీజేపీకి అభ్యర్థులు ముందుకు రాకపోవడం, అర్వింద్ - సురభి వర్గాల మధ్య సమన్వయం కొరవడిందనే ప్రచారం మొదట్లో వినిపించింది. అయితే జిల్లా అధ్యక్షులు డా. యాదగిరి బాబు అసమ్మతి బయటపడకుండా తనదైన శైలిలో

### మొత్తం 26 వార్డుల్లో ఎన్నికైన కౌన్సిలర్ల వివరాలు ఇలా ఉన్నాయి:

వార్డు 1లో ఓంకార్ నవీన్ (కాంగ్రెస్), 2లో జక్కం లక్ష్మీ (బీఆర్ఎస్), 3లో బత్తుల నరేష్ (కాంగ్రెస్), 4లో పందిరి రమేష్ (ఇండిపెండెంట్), 5లో పుడుకారం దివ్య రెడ్డి (బీజేపీ), 6లో బంగారుకాళ్ల నీరజ (బీఆర్ఎస్), 7లో ధర్మపురి స్వరూప (బీజేపీ), 8లో దీవకొండ మానస (బీఆర్ఎస్), 9లో బొడ్ల వసుధ, 10లో నునుగొండ నరేష్ (కాంగ్రెస్), 11లో రెబ్బాస్ మహేష్ (ఇండిపెండెంట్), 12లో తబస్సుమ్ ముఖీమ్, 13లో గుడికందుల అజయ్ (కాంగ్రెస్), 14లో దొనికెన శిరీష (బీజేపీ), 15లో అరిగేల అనూష, 16లో అరిసె వనజ (బీజేపీ), 17లో మైలారం లింబాద్రి (కాంగ్రెస్), 18లో చెట్లపల్లి మీనా, 19లో బొడ్ల ఆనంద్ (బీజేపీ), 20లో మాసుల ప్రవీణ్ (కాంగ్రెస్), 21లో అజీమొద్దీన్ (ఇండిపెండెంట్), 22లో అంగడి పురుషోత్తం (బీఆర్ఎస్), 23లో కోయల్ కార్ స్రవంతి (బీజేపీ), 24లో పూదారి జ్యోతి (బీఆర్ఎస్), 25లో పిర్దోస్ (బీఆర్ఎస్), 26లో బొడ్ల రమేష్ (బీజేపీ) విజయం సాధించారు. ఈ ఫలితాలతో మెట్‌పల్లి పట్టణంలో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. చైర్‌పర్సన్ ఎన్నికపై ఇప్పుడు ఉత్కంఠ నెలకొంది. బీజేపీ సాధించిన ఈ అనూహ్య విజయం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# మెట్‌పల్లిలో పద్మశాలిలకు నిరాశాజనక ఫలితాలు

- 28 మంది పోటీ ఒక్క వార్డులోనే విజయం
- మాజీ చైర్‌పర్సన్లకు ఓటమి - జర్నలిస్టులకూ ఘోర పరాజయం



**నేటి సాక్షి - మెట్‌పల్లి, రాధారపు నర్సయ్య :** మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో పద్మశాలి వర్గానికి తీవ్ర నిరాశ ఎదురైంది. కోరుట్ల నియోజకవర్గ పరిధిలో జనాభాలో గణనీయమైన శాతం పద్మశాలి కులానికి చెందిన వారే ఉన్నప్పటికీ, తాజా ఎన్నికల్లో ఆ వర్గం రాజకీయంగా సత్తా చాటలేకపోయింది.

### ఐక్యత లోపమే ప్రధాన కారణమా.?

మెట్‌పల్లి పట్టణంలోని 26 వార్డులలో ప్రతి వార్డులో పద్మశాలి సంక్షేమ సంఘాలు ఉన్నాయని, అదేవిధంగా పట్టణ స్థాయి సంఘం కూడా క్రియాశీలంగా ఉన్నప్పటికీ ఎన్నికల సమయంలో ఐక్యత లోపించిందని స్థానికులు చెబుతున్నారు. మొత్తం 26 వార్డుల నుంచి 28 మంది పద్మశాలి అభ్యర్థులు బరిలో నిలిచినా, కేవలం 7వ వార్డు నుంచి ధర్మపురి స్వరూప మాత్రమే విజయం సాధించారు. వర్గపోరు, ఆధిపత్య ధోరణి, సమన్వయం లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### గత వైభవం - ప్రస్తుత వెనుకబాటు

పద్మశాలి వర్గానికి చెందిన సాంబారి ప్రభాకర్ గతంలో మెట్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. మర్రి ఉమా రాణి, ధర్మపురి నాగరాణి వంటి నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులు నిర్వహించారు. అయితే ఈసారి ఎన్నికల్లో మాజీ చైర్‌పర్సన్ మర్రి ఉమా రాణి 25వ వార్డు నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. గత పాలకవర్గంలో గెలిచిన నలుగురు పద్మశాలి కౌన్సిలర్లు కూడా ఈ ఎన్నికల్లో పరాజయం చెందడం గమనార్హం.

### మాజీ చైర్‌పర్సన్లకు ఎదురుదెబ్బ.!

మెట్‌పల్లి పురపాలక సంఘానికి చైర్‌పర్సన్‌గా పనిచేసిన ఏశాల సుశీల 19వ వార్డు నుంచి టీఆర్పీ పార్టీ తరఫున పోటీ చేసి కేవలం పదహారు ఓట్లతో ఆరో స్థానంలో నిలిచారు. మొదటి చైర్‌పర్సన్ భర్త ఎర్రోళ్ల హన్మాండ్లు 23వ వార్డు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇది పట్టణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

### జర్నలిస్టులకూ ఘోర పరాజయం

ఇండిపెండెంట్‌లుగా పోటీ చేసిన పలువురు జర్నలిస్టులు కూడా ఘోర పరాజయం పాలయ్యారు. నేడు ప్రకటించిన ఫలితాల్లో వారు 2, 5, 5, 5, 7 ఓట్లతో సరిపెట్టుకున్నారు. వారిలో ఒకరు జర్నలిస్ట్ సతీమణి కాగా, ఇద్దరు అభ్యర్థులు తీన్మార్ మల్లన్న పార్టీ తరఫున బరిలో నిలిచినట్లు సమాచారం.మొత్తంగా ఈ ఎన్నికలు మెట్‌పల్లిలో సామాజిక సమీకరణాలపై గణనీయ ప్రభావం చూపించాయి. పద్మశాలి వర్గం రాజకీయంగా బలపడాలంటే ఐకమత్యం, సమన్వయం అవసరమని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.

# కోరుట్లలో..'లక్ష్మీ నారాయణ'ల జోరు.!

## ముగ్గురికి విజయం ఒకరికి ఓటమి




**నేటి సాక్షి - కోరుట్ల, రాధారపు నర్సయ్య :** కోరుట్ల మున్సిపల్ ఎన్నికల్లో 'లక్ష్మీ నారాయణ' పేరుతో బరిలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేక చర్చకు దారితీశారు. వివిధ వార్డుల నుంచి పోటీ చేసిన నలుగురిలో ముగ్గురు విజయం సాధించగా, ఒకరు పరాజయం పాలయ్యారు.


### ముగ్గురు 'లక్ష్మీనారాయణ'ల గెలుపు

3వ వార్డు నుంచి మోర్తాడ్ లక్ష్మీ నారాయణ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. 20వ వార్డు నుంచి చిట్యాల లక్ష్మీ నారాయణ కూడా కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 11వ వార్డు నుంచి కస్తూరి లక్ష్మీ నారాయణ బీజేపీ తరఫున పోటీ చేసి గెలిచారు.

### అనూహ్యంగా 32వ వార్డులో ఓటమి.!

ఇదే సమయంలో 32వ వార్డు నుంచి ఖచ్చితంగా విజయం సాధిస్తారని నమ్మకంగా ఉన్న 'జిందం లక్ష్మీ నారాయణ' కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి అనూహ్యంగా ఓటమి పాలయ్యారు.ఒకే పేరుతో నలుగురు అభ్యర్థులు పోటీ చేయడం, అందులో ముగ్గురు గెలవడం కోరుట్ల రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది.!

# మెట్‌పల్లిలో కాంగ్రెస్‌కు 'రెబల్' షాక్




- హస్తం పార్టీకి చుక్కలు చూపించిన సొంత నేతలు!

మున్సిపల్ పీఠం పోరులో చతికిలపడ్డ కాంగ్రెస్ - 26 సీట్లలో కేవలం ఆరు స్థానాలకే పరిమితం.

- బీ-ఫారంల కేటాయింపులో అనాలోచిత నిర్ణయాలే శాపమని పార్టీ అంతర్గత వర్గాల విశ్లేషణ.
- ఒకే ఇంటి పేరుతో వింత ఫలితాలు: బీజేపీ నుంచి ముగ్గురు గెలుపు - కాంగ్రెస్ నుంచి ముగ్గురు ఓటమి.

**మెట్‌పల్లి,రాధారపు నర్సయ్య - నేటి సాక్షి:** మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెబల్ అభ్యర్థులు కోలుకోలేని దెబ్బతీశారు. 'కాంగ్రెస్ పార్టీకి ఇతర శత్రువులు అవసరం లేదు' అన్న పాత సామెతను గుర్తుచేస్తూ, సొంత పార్టీ నేతలే అధికారిక అభ్యర్థుల ఓటమికి కారకులయ్యారు. మొత్తం 26 వార్డులకు గాను పార్టీ కేవలం ఆరు స్థానాల్లోనే విజయం సాధించడం గమనార్హం. టికెట్ల కేటాయింపులో క్షేత్రస్థాయి పరిస్థితులను విస్మరించి, అనాలోచితంగా బీ-ఫారంలు జారీ చేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 4, 11, 12, 15, 24, 25 మరియు 31వ వార్డులలో అభ్యర్థుల ఎంపికలో జరిగిన పొరపాట్లు ప్రత్యర్థి పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్‌లకు వరంగా మారాయి. ఎప్పటి నుంచో పార్టీని నమ్ముకున్న పందిరి రమేష్, కొమిరెడ్డి శేషగిరి, ముఖీమ్ భార్య వంటి వారికి టికెట్లు నిరాకరించడంతో, వారు స్వతంత్రంగా లేదా రెబల్స్‌గా బరిలోకి దిగారు. ఫలితంగా ఓట్లు చీలిపోయి కాంగ్రెస్ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు. కొన్ని వార్డులలో కేవలం రెండు ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందడం పార్టీలో సమన్వయ లోపాన్ని ఎత్తిచూపుతోంది. ఈ ఎన్నికల ఫలితాల్లో మరో ఆసక్తికర అంశం అభ్యర్థుల ఇంటి పేర్లు. బీజేపీ తరఫున పోటీ చేసిన 'బొడ్ల' ఇంటి పేరు గల రమేష్, ఆనంద్, వసుధలు ఘన విజయం సాధించగా.. కాంగ్రెస్ మద్దతుతో బరిలోకి దిగిన 'ద్యావనపల్లి' ఇంటి పేరు గల రాధా, ప్రవళిక, వరలక్ష్మిలు ఓటమి చెందారు. మొత్తానికి టికెట్ల కేటాయింపులో అసంతృప్తి మరియు బలమైన రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటమే మెట్‌పల్లిలో కాంగ్రెస్ పరాజయానికి ప్రధాన కారణాలని స్పష్టమవుతోంది.

## శంకర్‌పల్లి 14వ వార్డులో

# అభివృద్ధికి పట్టం

- ఐదేళ్ల నిరంతర సేవలకు ప్రజల విశ్వాస ముద్ర - భారీ మెజారిటీతో గెలుపు.
- సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులే విజయ సోపానాలుగా నిలిచిన వైనం.
- కాంగ్రెస్ శ్రేణుల సమిష్టి కృషి - ఇంటింటి ప్రచారంతో ఓటర్ల మన్ననలు.
- "మీ నమ్మకాన్ని వమ్ము చేయను - ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా" అన్న శ్వేతా హామీ.

**రెండోసారి శ్వేతా పాండురంగారెడ్డి ఘన విజయం!**






**శంకర్‌పల్లి, సుధాకర్ గౌడ్:** శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 14వ వార్డు మరోసారి అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. రెండోసారి కౌన్సిలర్‌గా పోటీ చేసిన శ్వేతా పాండురంగారెడ్డి ప్రజల మద్దతుతో ఘన విజయం సాధించి వార్డుపై తన పట్టును నిరూపించుకున్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో వార్డులో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఈ విజయం వెనుక ప్రధాన పాత్ర పోషించాయి. వార్డులో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, శాశ్వత అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, వీధి దీపాలు మరియు తాగునీటి సరఫరాను మెరుగుపరచడం వంటి పనులు ప్రజల్లో ఆమెపై నమ్మకాన్ని పెంచాయి. పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా అమలు చేస్తూ, ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించడం శ్వేతా పాండురంగారెడ్డి ప్రత్యేకతగా నిలిచింది. ఈ విజయ సాధనలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీకాంత్ ముదిరాజ్, మండల యూత్ ప్రెసిడెంట్ ప్రశాంత్ రెడ్డి, మరియు నాయకులు మైపాల్ రెడ్డి, మాల్ రెడ్డి, పాండు గౌడ్, వెంకట్ చారి తదితరులు కీలక పాత్ర పోషించారు. వీరు ఇంటింటికీ తిరిగి గత ఐదేళ్ల అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచి, పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ విజయాన్ని సాకారం చేశారు. విజయం అనంతరం శ్వేతా పాండురంగారెడ్డి భావోద్వేగంతో మాట్లాడుతూ.. "తనపై నమ్మకం ఉంచి రెండోసారి గెలిపించిన ప్రతి ఓటరుకు పేరుపేరునా ధన్యవాదాలు" తెలిపారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తానని, వార్డును మున్సిపాలిటీలోనే

---

# 'కారు.. సారు.. పదహారు' కాస్తా 'ఆరు'గా మారిన వైనం!

- మున్సిపల్ ఎన్నికల్లో చతికిలపడ్డ గులాబీ దళం కేవలం ఆరు సీట్లకే పరిమితం.
- ఎమ్మెల్యే డా. సంజయ్ సొంత వార్డులోనూ దక్కని విజయం - క్యాడర్‌లో నిరాశ.
- వలసలు, అంతర్గత విభేదాలతో కోరుట్ల, మెట్‌పల్లిలో షెడ్డుకెళ్లిన 'కారు'.

**నేటి సాక్షి మెట్‌పల్లి, రాధారపు నర్సయ్య:** ఒకప్పుడు 'కారు.. సారు.. పదహారు' అంటూ తెలంగాణ రాజకీయాల్లో మారుమోగిన నినాదం, నేడు మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత 'సారు.. కారు.. ఆరు' అంటూ ప్రత్యర్థుల వెటకారానికి వేదికైంది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో బీఆర్ఎస్ పార్టీ కేవలం ఆరు స్థానాలకే పరిమితం కావడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. మొత్తం 26 వార్డుల్లో కనీసం 15 సీట్లు గెలవాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే డా. సంజయ్ వ్యూహాలు రచించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి ఫలించలేదు. చివరికి ఎమ్మెల్యే సొంత వార్డుగా పరిగణించే 21వ వార్డులో కూడా పార్టీ అభ్యర్థి ఓటమి పాలవ్వడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో అధికారం మారిన తర్వాత ద్వితీయ శ్రేణి నాయకత్వం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం, వరుస వలసలు పార్టీని బలహీనపరిచాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పార్టీ ఫండ్ అందజేసినప్పటికీ, అభ్యర్థుల్లో గెలుపుపై ధీమా లేకపోవడం, ప్రచారంలో పోరాట పటిమ లోపించడం ఓటమికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. అటు కోరుట్ల మున్సిపాలిటీలో కూడా తొలిదశలో జోరు చూపించిన 'కారు', చివరకు 8 స్థానాలకే పరిమితమై బ్రేక్ డౌన్ అయ్యింది. ప్రస్తుతం ఎదురైన ఈ పరాభవం నుంచి కోలుకునేందుకు ఎమ్మెల్యే సంజయ్ దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండటం, వైద్య సేవలు అందించడం మరియు విద్యార్థులకు




విద్యా సామగ్రి పంపిణీ వంటి సేవా కార్యక్రమాల ద్వారా క్యాడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, మున్సిపల్ ఫలితాలు పార్టీకి గట్టి హెచ్చరికగా మారిన నేపథ్యంలో, భవిష్యత్తులో పునరుద్ధరణ దిశగా అడుగులు పడతాయా లేదా అన్నది వేచి చూడాలి.

---

# ఉపాధ్యాయ సంఘం ప్రెసిడెంట్‌గా లింగమూర్తి యాదవ్ ఎన్నిక



**నేటి సాక్షి చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లిలో శనివారం నిర్వహించిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో చౌడేపల్లి మండలానికి చెందిన శ్రీ లింగమూర్తి యాదవ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి కార్యవర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా లింగమూర్తి యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ నూతన జిల్లా కార్యవర్గంలో చౌడేపల్లి మండలానికి పెద్దపీట దక్కడం విశేషం. మొత్తం ఎనిమిది మందికి జిల్లా కమిటీలో కీలక బాధ్యతలు లభించాయి. జిల్లా కార్యదర్శిగా అంజలి, ఆర్థిక కమిటీ సభ్యులుగా పి. ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.బి. మురళీమోహన్ ఎన్నికయ్యారు. అలాగే సిపిఎస్ కమిటీ సభ్యులుగా జి. మునిరాజ మరియు జి. రవీంద్ర బాధ్యతలు చేపట్టనున్నారు. సాంస్కృతిక ప్రచార కమిటీ కన్వీనర్‌గా డి. నారాయణ యాదవ్, ప్రచార కమిటీ సభ్యులుగా సి. నాగరాజ ఎన్నికైనట్లు ప్రకటించారు. మండలం నుండి ఇంత భారీ సంఖ్యలో ఉపాధ్యాయ నేతలకు జిల్లా స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల చౌడేపల్లి మండల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు తోటి ఉపాధ్యాయులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయ లోకం సమస్యల మీద పోరాడటమే ధ్యేయంగా నూతన కార్యవర్గం పనిచేయాలని అందరూ ఆకాంక్షించారు.

---

# ఢిల్లీలో ఓసీల మహా ధర్నాను విజయవంతం చేయాలి

- రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి పిలుపు

**నేటి సాక్షి జగిత్యాల, పూరెళ్ల బాపు:** ఓసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 23న దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న జాతీయ స్థాయి మహా ధర్నాను విజయవంతం చేయాలని ఓసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, జిల్లా కన్వీనర్ మహంకాళి రాజన్న కోరారు. శనివారం జగిత్యాలలో ఓసీ సామాజిక సంక్షేమ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నాకు సంబంధించిన పోస్టరును నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓసీల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు తక్షణమే జాతీయ స్థాయి ఓసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల్లోని ఆర్థికంగా వెనుకబడిన వారు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలకు, రాజకీయ పదవులకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా



కల్పించిన 10 శాతం ఈడబ్ల్యూఎస్ (EWS) రిజర్వేషన్ల అమలుపై రాజకీయ లబ్ధి కోసం కొందరు ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. రిజర్వేషన్ల కొనసాగింపు వల్ల ఓసీలకు తీరని అన్యాయం జరుగుతోందని, జనరల్ స్థానాల్లో కూడా రాజకీయ పార్టీలు ఓసీలకు అవకాశం ఇవ్వకపోవడంవల్ల వారు రాజకీయంగా వెనుకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పటిష్టంగా అమలు చేసేందుకు జాతీయ ఈడబ్ల్యూఎస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓసీ జేఏసీ నాయకులు సిరిసిల్ల వేణుగోపాల్, రాజేందర్ శర్మ, సంత గౌతమ్ రెడ్డి, పుల్లూరి సత్యనారాయణ, ఉమాపతి శర్మ, కటకం చంద్రమౌళి, అయిల్నేని స్వప్న రావు, జనార్ధన్, బండారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

---

# వైస్ చైర్మన్ పదవి

**మాదిగలకు ఇవ్వాలి**

**ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్.**





**నేటి సాక్షి:శంకర్‌పల్లి :** శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్సీ మాదిగ కులానికి చెందిన వారికి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. నేటి వరకు శంకర్ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ అవకాశం ఇవ్వలేదు కావున ఈ సారి శంకర్‌పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి మాదిగ కులానికి ఇవ్వాలి అని రంగారెడ్డి జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ఎమ్మెల్యే కాలే యాదయ్య, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భారత్ విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని ప్రవీణ్ కుమార్ అన్నారు.

# రాష్ట్రంలో రేవంత్ రెడ్డి

**రాజ్యాంగం అమలవుతోంది**

**బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్**



**నేటి సాక్షి నారాయణపేట మరికల్ ,ఇమామ్ సాబ్:** తెలంగాణ రాష్ట్రంలో బహుజన కులాలు రాజకీయంగా ఎదగకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. శనివారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆధిపత్య కుల ధోరణిపై మండిపడ్డారు. మేడ్చల్ జిల్లా ఆలియాబాద్ మున్సిపాలిటీలో బీఎస్పీ తరపున గెలుపొందిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్ గూదె వెంకటేష్‌ను కాంగ్రెస్ నాయకులు బలవంతంగా తీసుకెళ్లడం దారుణమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం నుండి ఒక ప్రజాప్రతినిధిని బలవంతంగా తీసుకెళ్తుంటే, అక్కడ ఉన్న పోలీసులు అతనికి రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని శ్రీనివాస్ విమర్శించారు. దొరల రాజ్యంలో పోలీసు వ్యవస్థ కూడా దొరలకే కొమ్ము కాస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో భారత రాజ్యాంగం కాకుండా రేవంత్ రెడ్డి స్వంత రాజ్యాంగం అమలవుతున్నట్లు కనిపిస్తోందని దుయ్యబట్టారు. బహుజన కులాలను అణచివేయాలని చూస్తే కాంగ్రెస్ పార్టీకి పుట్టగతులు లేకుండా చేసే బాధ్యతను బీఎస్పీ తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. ఈ అరాచక పాలనకు వ్యతిరేకంగా బహుజనులందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# తేల లక్ష్మి రమేష్ విజయం

**గన్నేరువరంలో సంబరాలు**



**నేటి సాక్షి గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్ ):** కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో 13వ డివిజనల్ కార్పొరేటర్ గా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల లక్ష్మి రమేష్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు గన్నేరువరం గ్రామంలో తేల లక్ష్మి రమేషులు ఘనవిజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు తేల రవీందర్ ఉపాధ్యక్షులు మచ్చ బాలరాజ్ బూర రామకృష్ణ తెల్ల అంజయ్య తెల్ల బక్కయ్య బూర వెంకటేశ్వర్లు తిరుపతి  తెల్ల బాలయ్య వేముల నాందేవ్ తెల్ల మహేందర్ తదితరులు పాల్గొన్నారు

# దామోదరం సంజీవయ్య జయంతి




**నేటి సాక్షి జూపాడుబంగ్లా:** మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దళిత తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య105వ జయంతిని పురస్కరించుకొని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, మాల మహానాడు అధ్యక్షుడు ఆర్ఎంపీ డాక్టర్ ఎర్రన్న, తదితర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దేశంలో దళిత తొలి ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించాలని వారు కొనియాడారు ఎన్నో రాజకీయ పదవులు చేపట్టి అనుభవించినప్పటికీ నిస్వార్థంగా నిజాయితీగా నిరాడంబరంగా జీవించారన్నారు అంతే కాకుండా ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా కేంద్ర మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు ఆయన చేసిన సేవలకు కర్నూలు జిల్లాలోని పెద్దపాడులో విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్, నక్క మల్లయ్య, బాల నారాయణ గౌడ్,  షాలు భాష, మన్సూర్ భాష, వెంకటస్వామి, బాదుల్లా, బ్యాంకు గిరి, తదితరులు పాల్గొన్నారు.

# స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ విజయం




టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా నేడు కోల్‌కతాలో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై ఇంగ్లాండ్ అద్భుత విజయం సాధించింది. 5 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తుచేసింది. వెస్టిండీస్ చేతిలో ఓటమి తర్వాత డీలా పడ్డ ఇంగ్లాండ్‌కు ఈ గెలుపు టానిక్‌లా పనిచేసింది. మొదట బౌలింగ్లో అదిల్ రషీద్ మాయ చేయగా, ఛేజింగ్ లో టామ్ బాంటన్ వీరోచిత ఇన్నింగ్స్ తో జట్టును గెలిపించాడు. స్కాట్లాండ్ నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ మరో 10 బంతులు మిగిలి ఉండగానే, 18.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ గెలుపుతో ఇంగ్లాండ్ తన సూపర్-8 అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచిన ఇంగ్లాండ్ సారథి హ్యారీ బ్రూక్ బౌలింగ్ ఎంచుకోవడంతో స్కాట్లాండ్ బ్యాటింగ్ కు దిగింది. ఇంగ్లీష్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు స్కాట్లాండ్ బ్యాటర్లు నిలవలేకపోయారు. ఆ జట్టు నిర్ణీత 19.4 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్కాట్లాండ్ తరపున రిచీ బెరింగ్టన్ 49 పరుగులతో ఒంటరి పోరాటం చేయగా, టామ్ బ్రూస్ 24 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో వెటరన్ స్పిన్నర్ అదిల్ రషీద్ 36 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. పేసర్ జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థి స్కోరును కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 153 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ కు ఆరంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్ (2), జాస్ బట్లర్ తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత వచ్చిన జాకబ్ బెథెల్, కెప్టెన్ హ్యారీ బ్రూక్ కూడా స్వీప్ షాట్లకు ప్రయత్నించి వికెట్లు పారేసుకున్నారు. దీంతో ఇంగ్లాండ్ శిబిరంలో ఆందోళన మొదలైంది. అయితే ఈ దశలో క్రీజులోకి వచ్చిన టామ్ బాంటన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 41 బంతుల్లోనే అజేయంగా 63 పరుగులు చేశాడు. ముఖ్యంగా మార్క్ వాట్ వేసిన ఒకే ఓవర్లో మూడు భారీ సిక్సర్లు బాది మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. సామ్ కరన్ (28) అతనికి చక్కటి సహకారం అందించాడు. చివర్లో విల్ జాక్స్ విన్నింగ్ షాట్ కొట్టి లాంఛనం పూర్తి చేశాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టామ్ బాంటన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ విజయంతో ఇంగ్లాండ్ గ్రూప్-సి పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మెరుగుపచుకుని తదుపరి దశకు వెళ్లే అవకాశాలను పెంచుకుంది. మరోవైపు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ స్కాట్లాండ్ కు నిరాశే మిగిలింది.




# టోర్నీలో బోణీ కొట్టిన ఐర్లాండ్




## ఒమన్‌పై 96 పరుగుల తేడాతో విక్టరీ

టీ20 వరల్డ్ కప్‌లో రెండు వరుస ఓటముల తర్వాత ఐర్లాండ్ అద్భుతమైన కమ్ బ్యాక్ ఇచ్చింది. శనివారం ఒమన్ తో జరిగిన మ్యాచ్ లో ఏకంగా 96 పరుగుల తేడాతో నెగ్గి టోర్నీలో బోణీ కొట్టింది. ఐర్లాండ్ నిర్దేశించిన 236 పరుగుల లక్ష్య ఛేదనలో ఒమన్ 18 ఓవర్లలో 139 పరుగుకే కుప్పకూలింది. ఆమిర్ ఖలీమ్ (50 పరుగులు), హమ్మద్ మీర్జా (46 పరుగులు) ఇద్దరే రాణించారు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జోషువా లిటిల్ 3, బ్యారీ మెక్ , మ్యాథ్యూ హాంపీర్స్ చెరో 2, జార్జ్ డాక్రెల్ 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. లోర్కన్ టక్కర్ (94 పరుగులు; 51 బంతుల్లో; 10ఇ4, 4ఇ6), డిలానీ (56 పరుగులు; 30 బంతుల్లో; 3ఇ4, 4ఇ6), జార్జ్ డాక్రెల్ (35 పరుగులు, 9 బంతుల్లోనే, 5 సిక్స్ లు) రాణించడంతో భారీ స్కోర్ దక్కింది. ఈ వరల్డ్ కప్ ఎడిషన్ లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3, షా ఫైసల్, ఆమిర్ ఖలీమ్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. భారీ ఇన్నింగ్స్ తో రాణించిన లోర్కన్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇక టీ20ల్లో పరుగుల పరంగా ఐర్లాండ్ కు ఇది మూడో అత్యధిక మార్జిన్ విజయం. 2023లో ఆస్ట్రియాతో జరిగిన మ్యాచ్ లో ఐర్లాండ్ ఏకంగా 128 పరుగుల తేడాతో నెగ్గింది. టీ20 హిస్టరీలో ఆ జట్టుకు బిగ్గెస్ట్ మార్జిన్ తో విజయం సాధించిన మ్యాచ్ ఇదే. దీని తర్వాత 2017లో స్కాట్లాండ్ తో 98 పరుగుల తేడాతో గెలుపొందింది. ఇది రెండో అత్యధికం. అలాగే ఈ మ్యాచ్ లో ఇంకో అరుదైన ఘతన నమోదైంది. ఇరుజట్లలోని ఎడమచేతి వాటం బౌలర్లు ఈ మ్యాచ్ లో 11 వికెట్లు పడగొట్టారు. ఒక టీ20 వరల్డ్ కప్ మ్యాచ్ లో ఎడమచేతి వాటం బౌలర్లు అత్యధిక వికెట్లు పడగొట్టిన మ్యాచ్ ఇదే. బంగ్లాదేశ్ జం ఒమన్ మ్యాచ్ తో ఈ మ్యాచ్ నిలిచింది. అది 2021 వరల్డ్ కప్ లో జరిగింది.

**ఐర్లాండ్ తుది జట్టు : రాస్ అడైర్, టిమ్ టెక్టర్, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్ (కెప్టెన్, వికెట్ కీపర్), కర్టిస్ కాంఫర్, జార్జ్ డాక్రెల్, గారెత్ డెలానీ, మార్క్ అడైర్, బారీ మెక్కార్తీ, మాథ్యూ హంఫ్రీస్, జాషువా లిటిల్**

**ఒమన్ తుది జట్టు : అమీర్ కలీం, జతీందర్ సింగ్ (కెప్టెన్), హమ్మద్ మీర్జా, ఆశిష్ ఒడెదర, మహ్మద్ నదీమ్, జితేన్ రామానంది, వినాయక్ శుక్లా (వికెట్ కీపర్), నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మహ్మద్, షా ఫైజల్, షకీల్ అహ్మద్**



# ప్రియురాలికి హార్దిక్ పాండ్యా మరిచిపోలేని జ్ఞాపకం

ఫిబ్రవరి 15న పాకిస్తాన్‌తో హైవోల్టేజ్ ఉన్నప్పటికీ భారత స్టార్ క్రికెటర్ హార్దిక్ పాండ్యా తన గర్ల్‌ఫ్రెండ్ మహికా శర్మకు ఈ వాలెంటైన్స్ డేని మరింత ప్రత్యేకంగా మార్చారు. తన గర్ల్‌ఫ్రెండ్ పేరులోని మొదటి అక్షరం 'వీ'ని తన మెడ వెనుక భాగంలో పాండ్యా టాటూ వేయించుకున్నాడు. ఈ టాటూను సెలబ్రిటీ టాటూ ఆర్టిస్ట్ సన్నీ భానుశాలి, లీడ్ ఆర్టిస్ట్ తుషార్ మరానే రూపొందించారు. హార్దిక్ ఎం అక్షరంతో కొత్త టాటూ మహికా శర్మపై తన ప్రేమను వ్యక్తం చేస్తోంది. ఈ వాలెంటైన్స్ డే ఆమెకు ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఫ్యాన్స్ సైతం కామెంట్లు చేస్తున్నారు. టీమ్ సమాచారం ప్రకారం, హార్దిక్ పాండ్యా మొదట మహికా కోసం కేవలం ఒక చిన్న టాటూ వేయించుకోవాలని అనుకున్నాడు. కానీ వారు తమ రిలేషన్, ఒకరి గురించి ఒకరు మాట్లాడుకుంటున్నప్పుడు, ఆ ఐడియా పెద్దదిగా మారింది. చివరికి వాలెంటైన్స్ డే గిఫ్ట్ గా మారింది. టాటూలో మీరు గమనిస్తే.. 2 చిరుతపులులు ఉన్నాయి. మొదటి చిరుతపులి చాలా పవర్‌ఫుల్, నేచురల్‌గా కనిపిస్తుంది. ఇది హార్దిక్ పాండ్యా బలాన్ని, శ్రమను సూచిస్తుంది. రెండో చిరుతపులి లైన్ ఆర్ట్‌లో రూపొందించారు. ఇది మొదటి చిరుత చుట్టూ తిరుగుతున్నట్లు ఉంటుంది. తన గాళ్‌ఫ్రెండ్ మహికా పేరులోని మొదటి అక్షరం 'వీ' స్పష్టంగా కనిపిస్తుంది. హార్దిక్ మొదట కేవలం మహికా పేరులోని మొదటి అక్షరాన్ని మాత్రమే టాటూ వేయించుకోవాలని భావించాడని సన్నీ భానుశాలి తెలిపారు. కానీ మాట్లాడుతున్న సమయంలో వారి బంధంలోని ఒక స్పెషల్ స్టోరీ బయటకు వచ్చింది. వారు ఒకరికొకరు బలాన్ని అందించే పార్ట్‌నర్స్ కావాలని భావించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్థవంతంగా చూపించడానికి చిరుతపులి టాటూ సరైన చిహ్నంగా మారింది. ఈ టాటూ కేవలం ఫ్యాషన్ కోసం మాత్రమే కాదు. కొన్ని టాటూలు కేవలం అడిగితే, లేక ఎవరైనా సూచిస్తే వేసుకుంటారు. కానీ కొన్ని వాటంతట అవే రూపుదిద్దుకుంటాయి. హార్దిక్ ఈ టాటూ నమ్మకంతో పాటు భావోద్వేగంతో తయారైంది. టాటూ ఏదైనా రియల్ స్టోరీని ప్రతిబింబించినప్పుడు, అది కేవలం రంగుగా మాత్రం మిగిలిపోదు. వారికి, ప్రియమైన వ్యక్తికి అది ఒక జ్ఞాపకంగా మారుతుంది. హార్దిక్ పాండ్యా గత ఏడాది 2025లో మహికా శర్మతో తన రిలేషన్ పై స్పందించాడు. ప్రస్తుతం వీరు ప్రేమలో మునిగి తేలుతున్నారు. గతంలో హార్దిక్ పాండ్యా విదేశీ మోడల్, బాలీవుడ్ నటి నటాషా స్టాంకోవిచ్‌ను వివాహం చేసుకున్నాడు. వీరిద్దరూ మే 2020లో ఇంట్లోనే సాధారణంగా వివాహం చేసుకోగా, ఫిబ్రవరి 2023లో రాజస్థాన్‌లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వైభవంగా పెళ్లి చేసుకున్నారు. ఏడాదిన్నరలోనే కథ ముగిసింది. అభిప్రాయభేదాలు రావడంతో జూలై 2024లో వారు విడిపోతున్నట్లు ప్రకటించారు. వీరికి కుమారుడు అగస్త్య ఉండగా.. బాలుడి బాధ్యతలను ఇద్దరూ చూసుకుంటున్నారు.

# ఏప్రిల్ 1న మా పెళ్లి!



సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో 'మేము కేవలం మంచి స్నేహితులమే' అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు. ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను ఈ విషయంపై ప్రశ్నించారు. ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?' అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. ఫిబ్రవరి 14 కాదు ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!' అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, 'ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. 'ఇది నిజంగా భయంకరంగా ఉంది' అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.

## ర్యూమర్స్‌పై చమత్కరించిన మృణాల్ ఠాకూర్

# రోషన్ హీరోగా ఏమో ఏమో ఇది

ఛాంపియన్ హీరో రోషన్ మేక టాలెంటెడ్ డైరెక్టర్ శైలేష్ కొలను కాంబినేషన్‌లో రూపొందుతున్న సరికొత్త చిత్రానికి 'ఏమో ఏమో ఇది' అనే క్లాసిక్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. వాలెంటైన్స్ డే సందర్భంగా శనివారం ఈ సినిమా టైటిల్‌తో పాటు 'ద ఫస్ట్ బ్రీజ్' పేరుతో ఒక చిన్న గ్లింప్స్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఇప్పటివరకు 'హిట్' సిరీస్, 'సైంధవ్' వంటి ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్లతో మెప్పించిన శైలేష్ కొలను, ఈసారి పూర్తి భిన్నంగా రొమాంటిక్ కామెడీ జానర్‌ను ఎంచుకోవడం విశేషం. ఈ గ్లింప్స్‌లో హీరో రోషన్ (అభయ్) తన తల్లితో అమ్మాయిల గురించి, నేటి తరం రిలేషన్ షిప్స్ గురించి చేసే కామెడీ సంభాషణలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సినిమాలో రోషన్ సరసన 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ (అపూర్వ పాత్రలో) కథానాయికగా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలకు అద్భుతమైన మ్యూజిక్ అందించిన హేషామ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాకు సంగీతం సమకూరుస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని 2026 దసరా కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.






# అట్లీ-అల్లు అర్జున్ మూవీ

## సినిమా షూటింగ్ డిలేపై అల్లు అసహనం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ కుమార్‌తో చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా గురించి ఇండస్ట్రీలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెతో హాలీవుడ్ రేంజ్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజువల్ వండర్‌గా, హైఎండ్ గ్రాఫిక్స్‌తో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. అందుకే ఈ సినిమాకు సంబంధించిన చిన్న న్యూస్ అయినా సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ అవుతోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, ఈ సినిమా విడుదల తర్వాత ఇండియన్ సినిమా మేకింగ్ స్టైల్‌లో కొత్త ట్రెండ్ సెట్ అవుతుందని భావిస్తున్నారు. లార్జ్ స్కేల్ ప్రాజెక్ట్స్‌కు ఈ సినిమా ఫౌండేషన్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుందనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై మరో టాక్ ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతోంది. అదేంటంటే? సినిమా షూటింగ్ అనుకున్న దానికంటే నెమ్మదిగా సాగుతుండటంతో అల్లు అర్జున్ అసంతృప్తిగా ఉన్నాడని గాసిప్స్ వినిపిస్తున్నాయి. ప్లాన్ చేసిన రిలీజ్ డేట్‌కు సినిమా పూర్తి అవుతుందా లేదా అన్న ఆందోళన కూడా బన్నీకి ఉన్నట్లు టాక్. ఈ నేపథ్యంలో మేకర్స్‌తో మాట్లాడి, మేకింగ్‌ను మరింత పక్కాగా ప్లాన్ చేసి షూటింగ్ వేగవంతం చేయాలని సూచించినట్టు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ న్యూస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ మరో తమిళ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తో కూడా సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన రావడంతో ఫ్యాన్స్‌లో మరింత ఎగ్జైట్మెంట్ పెరిగింది. ఆ సినిమా కూడా భారీ పాన్ ఇండియా లెవల్‌లో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా చూస్తే, అట్లీ – అల్లు అర్జున్ కాంబినేషన్ మూవీ 2027లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్ట్స్ పూర్తయ్యే సరికి అల్లు అర్జున్ రేంజ్ గ్లోబల్ లెవల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్యాన్స్ మాత్రం ఈ భారీ సినిమాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఘట్టమనేని మరో వారసుడు జయకృష్ణ ఎంట్రీ

## శ్రీనివాస మంగాపురం మూవీ పోస్టర్ విడుదల

వాలంటైన్స్ డే సందర్భంగా తెలుగు సినీ ప్రియులకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్‌ను చిత్ర బృందం నేడు విడుదల చేసింది. విడుదలైన పోస్టర్‌లో 'ఏ భాషలో చెప్పాలి నా ప్రేమని, వెయ్యేళ్ళ నా ఈ ఎడబాటుని' అంటూ కథానాయకుడు శ్రీను మంగతో చెప్పిన డైలాగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.







# లోకేశ్ హీరోగా డీసీ

'ఖైదీ', 'విక్రమ్', 'కూలీ' వంటి విజయవంతమైన చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు నటుడిగా మారబోతున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. ఈ సినిమాకు అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. సన్ పిక్చర్స్ నిర్మిస్తుంది. లోకేశ్ కనగరాజ్ సరసన వామికా గబ్బీ కథానాయికగా నటిస్తుంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను వాలంటైన్స్ కానుకగా విడుదల చేసింది చిత్రయూనిట్. గ్లింప్స్‌లో లోకేష్ కనగరాజ్ ఇంటెన్స్ అండ్ రా లుక్‌లో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. లోకేష్ ఇందులో దేవదాస్ పాత్రలో కనిపించబోతున్నాడు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

**నాయకత్వ లక్షణాలు: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నేటి సాక్షి మంచిర్యాల:** క్రీడల ద్వారా యువతలో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉత్సాహం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంలో జరుగుతున్న 'సి.ఎం. కప్ 2025' జిల్లా స్థాయి పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరితో కలిసి ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ స్థాయి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహిస్తోందని, క్రీడలు టీమ్ వర్క్ ప్రాధాన్యతను నేర్పిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని చాటాలని, ఒక్కసారి ఓడిపోయినంత మాత్రాన నిరుత్సాహపడకుండా పట్టుదలతో ప్రయత్నించి లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ క్రీడాకారులకు సూచించారు. ఇప్పటికే గ్రామీణ, మండల మరియు నియోజకవర్గ స్థాయి పోటీలు పూర్తి చేసుకుని జిల్లా స్థాయికి చేరుకున్న క్రీడాకారులు, ఇక్కడ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా క్రీడల కోటా ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందే వీలుందని, ఏకాగ్రతతో శిక్షణ పొంది భవిష్యత్తులో ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల నుండి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అధికారులు తెలిపారు. అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్ మరియు సైక్లింగ్ వంటి వివిధ క్రీడాంశాలలో పోటీలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఎన్నికల సమయం కావడంతో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ, క్రీడా పోటీలను దిగ్విజయంగా నిర్వహించిన అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## కూడవెల్లి వాగు మత్తడి పరవళ్లు

**కట్టు కాలువ గండ్లతో రైతుల కన్నీళ్లు!**



**నేటి సాక్షి తొగుట వడ్డే నరసింహులు:** మండలంలోని చందాపూర్ గ్రామంలో కూడవెల్లి వాగు పెద్దమత్తడి శుక్రవారం సాయంత్రం నుండి పరవళ్లు తొక్కడం సంతోషకరమని, అయితే ఆ నీటిని వినియోగించుకోవాల్సిన కట్టు కాలువ అధ్వానంగా ఉండటం విచారకరమని మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు యాదవ్ అన్నారు. శనివారం ఆయన చందాపూర్ పెద్దమత్తడి వద్ద రైతులతో కలిసి కాలువ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చందాపూర్ మత్తడి నుండి ప్రవహించే ఈ కట్టు కాలువ ద్వారా జప్తి లింగారెడ్డిపల్లి, అల్వాల, మల్లుపల్లి మీదుగా రుద్రారం వరకు వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అయితే గత నాలుగైదు ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కాలువ నిర్వహణను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. కాలువలో తుంగ, ముళ్ల చెట్లు దట్టంగా పెరగడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని, గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కాలువ పూర్తిగా గండిపడి తెగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ తెగిపోవడంతో దిగువన ఉన్న రైతుల పొలాలు ఇసుక మేటలు వేసి తీవ్రంగా నష్టపోయారని, అధికారులు ఇప్పటికీ ఆ గండ్లను పూడ్చకపోవడంతో రైతులు ఈ యాసంగిలో సాగుకు దూరమయ్యారని తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన కట్టు కాలువకు మరమ్మతులు చేపట్టాలని, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బొడ్డు శ్రీకాంత్ యాదవ్, సిరిసిల్ల బాల్ నర్స్, బెజగామ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చట తీరకముందే ఓటమి పాలైన అభ్యర్థులు!

- మున్సిపల్ పీఠంపై ఆశలు పెట్టుకున్న ప్రధాన పార్టీల నేతలకు ఓటర్ల షాక్.
- రెబల్స్ బెడద, స్థానికత మరియు కుల సమీకరణాలతో తలకిందులైన లెక్కలు.
- ప్రచారంలో జోరు చూపించినా.. పోలింగ్ నాటికి మలుపు తిరిగిన ఓటరు తీర్పు.



**నేటి సాక్షి,కోరుట్ల,రాధారపు నర్సయ్య:** కోరుట్ల మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ప్రధాన పార్టీల 'ఛైర్ పర్సన్' అభ్యర్థులకు ఊహించని షాక్ ఇచ్చాయి. పది రోజులుగా ప్రచారంలో జోరు చూపిస్తూ, మున్సిపల్ పీఠాన్ని అధిరోహిస్తామన్న ధీమాతో ఉన్న అభ్యర్థుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రత్యర్థుల ఎత్తుగడలు, అంతర్గత కుమ్ములాటలు మరియు ఓటర్ల నాడిని పసిగట్టడంలో విఫలం కావడం వీరి ఓటమికి కారణాలుగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ తరఫున 15వ వార్డు నుంచి బరిలో నిలిచిన సిట్టింగ్ కౌన్సిలర్ ఆడెపు కమల, బిఆర్ఎస్ అభ్యర్థి అబ్దుల్ హఫీజ్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆమె చేసిన అభివృద్ధి కంటే ప్రజలు 'మార్పు' వైపు మొగ్గు చూపడం విశేషం. ఇక 29వ వార్డులో బీజేపీ ఛైర్మన్ అభ్యర్థిగా బరిలోకి దిగిన అల్లాడి శోభా-ప్రవీణ్, కాంగ్రెస్ అభ్యర్థి యాటం పద్మ చేతిలో ఓడిపోయారు. ఇక్కడ బీజేపీలో తలెత్తిన 'రెబల్' విభేదాలు, టికెట్ ఆశించి భంగపడ్డ తోట రాజేశం వర్గం ఓట్లు చీల్చడం అల్లాడి శోభకు శాపంగా మారింది. తనపై వచ్చిన తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు రాజేశం తన భార్యను పోటీలో నిలపడం బీజేపీ అభ్యర్థిని ఓటమి అంచుకు నెట్టింది. అత్యంత ఆసక్తికరంగా సాగిన 9వ వార్డు పోరులో బిఆర్ఎస్ 'ఛైర్ పర్సన్' అభ్యర్థి గంధ్ర శిల్ప ఓటమి చెందడం చర్చనీయాంశంగా మారింది. దివంగత మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంధ్ర రాజు ఇమేజ్, ఎమ్మెల్యే సంజయ్ ముందస్తు వ్యూహాలు, పోగుల ఉమారాణి వంటి బలమైన నేతల మద్దతు ఉన్నప్పటికీ ఆమె గట్టెక్కలేకపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎడ్ల జలజ చేతిలో ఆమె పరాజయం పొందారు. చివరి నిమిషంలో తెరపైకి వచ్చిన 'స్థానికత' మరియు 'కులం' అనే అంశాలే ఆమె విజయానికి అడ్డుకట్ట వేసినట్టు వార్డులో చర్చ జరుగుతోంది. మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలన్న ఈ ముగ్గురు మహిళా నేతల కలలు ఓటర్ల తీర్పుతో కరిగిపోయాయి.

## మెట్‌పల్లిలో బీజేపీ మార్క్ పాలిటిక్స్



- మైనారిటీలకు వైస్ ఛైర్మన్ పదవి ఆఫర్!

**నేటి సాక్షి మెట్‌పల్లి,రాధారపు నర్సయ్య:** మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. పట్టణంలో పార్టీకి పూర్వ వైభవం తిరిగి వచ్చిందని బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు, రాష్ట్ర నాయకుడు డాక్టర్ రఘు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మెట్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే తమ తదుపరి లక్ష్యమని స్పష్టం చేశారు. మొత్తం 26 వార్డులకు గాను బీజేపీ 10 స్థానాలను గెలుచుకోవడం శుభపరిణామమని, ఇది పార్టీ బలోపేతానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఒక వ్యూహాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. తమ పార్టీకి మద్దతు ఇచ్చే మైనారిటీ కౌన్సిలర్‌కు వైస్ ఛైర్మన్ పదవిని కట్టబెడతామని డాక్టర్ రఘు సంచలన ప్రకటన చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు మరే ఇతర రాజకీయ పార్టీ మైనారిటీలకు వైస్ ఛైర్మన్ పదవి ఇస్తామని ముందుకు రాలేదని, ఇప్పటికే కొందరు స్వతంత్ర మైనారిటీ అభ్యర్థులు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు. పట్టణంలో గతంలో బీజేపీకి ఉన్న పట్టును ఈ ఫలితాలు మళ్ళీ నిరూపించాయని, ఎంపీ అరవింద్ నాయకత్వంలో మెట్‌పల్లిని 'స్మార్ట్ సిటీ'గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయ సమీకరణాలు మారినప్పటికీ, ప్రస్తుతం ప్రజలు మళ్ళీ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని యాదగిరి బాబు విశ్లేషించారు. మెట్‌పల్లి నుంచి ప్రారంభమైన ఈ మార్పు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందజేయడంతో పాటు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పనకు తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఎన్నికల ఇంచార్జీ అద్దాపూర్ రాజేష్, పోలీస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొని, పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేసిన కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'బాస్' పీఠం కోసం బీజేపీ, కాంగ్రెస్ మైండ్ గేమ్!

**నేటి సాక్షి మెట్‌పల్లి, రాధారపు నర్సయ్య:** మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడటంతో ఇప్పుడు అందరి దృష్టి 'బల్దియా కా బాస్' ఎవరనే అంశంపైనే నెలకొంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో హంగ్ ఏర్పడి, ఛైర్ పర్సన్ ఎన్నిక ఉత్కంఠభరిత క్లైమాక్స్‌ను తలపిస్తోంది. 26 వార్డుల్లో అత్యధికంగా 10 స్థానాలను కైవసం చేసుకున్న భారతీయ జనతా పార్టీ, పీఠాన్ని దక్కించుకోవడానికి మరో నలుగురు కౌన్సిలర్ల మద్దతు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అతిపెద్ద పార్టీగా అవతరించిన తమకే నైతికంగా ఛైర్మన్ పదవి దక్కుతుందని బీజేపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు, అధికార కాంగ్రెస్ పార్టీ కూడా చక్రం తిప్పేందుకు సిద్ధమైంది. ఇప్పటికే నలుగురు ఇండిపెండెంట్ల మద్దతు కూడగట్టుకున్న కాంగ్రెస్ అభ్యర్థి మైలారం లింబాద్రి, ఛైర్మన్ పీఠంపై గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ సమీకరణాల్లో ఇప్పుడు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కీలకంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ చేసినప్పటికీ, కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం కుదిరిందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. ఇరు పార్టీల నేతలు బీఆర్ఎస్ మద్దతు తమకేనని లోలోపల ప్రచారం చేసుకుంటుండటంతో, సోమవారం జరిగే ఎన్నికల వరకు ఈ సస్పెన్స్ కొనసాగేలా కనిపిస్తోంది. సోమవారం (ఫిబ్రవరి 16) నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం, అనంతరం జరగనున్న ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల కోసం యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. హంగ్‌లో కౌన్సిలర్ల కొనుగోలు లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రధాన పార్టీల కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాల్లో ఉండటంతో, సోమవారం బల్దియా పీఠం ఎవరికి దక్కుతుందనేది పట్టణ ప్రజల్లో ఉత్కంఠను రేపుతోంది.



## దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు



**నేటి సాక్షి పాములపాడు :** ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రానికి దళిత తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన దామోదరం సంజీవయ్య105 జయంతిని స్థానిక సిపిఎం కార్యాలయంలో మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు కలబండి అంకన్న అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ముందుగా సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరీ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు సిపిఎం మండల కార్యదర్శి డి సోమన్న సిఐటియు మండల కార్యదర్శి మేకల రాజు మాట్లాడుతూ దేశంలో దళిత తొలి ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రానికి ఎనలేని సేవలు అందించాలని వారు కొనియాడారు ఎన్నో రాజకీయ పదవులు చేపట్టి అనుభవించినప్పటికీ నిస్వార్థంగా నిజాయితీగా నిరాడంబరంగా జీవించారన్నారు అంతే కాకుండా ఏఐసీసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా కేంద్ర మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు ఆయన చేసిన సేవలకు కర్నూలు జిల్లాలోని పెద్దపాడులొ విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్షావలి రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి రామకృష్ణ ఆటో కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరుడు మల్లికార్జున బీసీ నేత సాయి కృష్ణ సోషల్ మీడియా ప్రతినిధులు గోవిందు శ్రీకాంత్ షర్ఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు

# డబ్బు, మద్యంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు

● **బీఎస్పీ నేత కత్తుల కాన్షీరామ్**



**నేటి సాక్షి నల్లగొండ :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు డబ్బు, మద్యంతో ఓటర్లను ప్రలోభపెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయని బీఎస్పీ జోనల్ ఇంచార్జ్ కత్తుల కాన్షీరామ్ ఆరోపించారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌తో పాటు వామపక్ష పార్టీలు కూడా ఓటుకు వెయ్యి నుండి 30 వేల రూపాయల వరకు పంపిణీ చేశాయని విమర్శించారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, ఇన్ని ప్రలోభాల మధ్య కూడా రాజ్యాంగ పరిరక్షణ కోసం బీఎస్పీ అభ్యర్థులకు ఓటు వేసిన ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా హాలియాలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిపై కాంగ్రెస్ గూండాలు మరియు ఎమ్మెల్యే అనుచరులు భౌతిక దాడికి పాల్పడటాన్ని కాన్షీరామ్ తీవ్రంగా ఖండించారు. బహుజన నాయకులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి కేసు నమోదు చేసిన డీఎస్పీ శివరామ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నేతలు కిరణ్, గ్యార శేఖర్, వంటేపాక యాదగిరి, శెట్టిపల్లి కాశీరాం, గుత్త వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లి మండలంలో మహాశివరాత్రి శోభ



● **శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు**

**నేటి సాక్షి శంకర్‌పల్లి:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శంకర్ పల్లి మండలంలోని గ్రామాల్లో మరియు మున్సిపాలిటీ పరిధిలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి. శనివారం మండలంలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. చందిప్ప గ్రామంలోని ప్రసిద్ధ మరకత శివాలయానికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి శివలింగాన్ని దర్శించుకుంటున్నారు. అలాగే శంకర్ పల్లి పట్టణంలోని శ్రీ హనుమాన్ విఠలేశ్వరాలయంలో కొలువై ఉన్న స్ఫటిక లింగ రూప శ్రీ కాశీ విశ్వనాథ స్వామివారికి విశేష అభిషేకాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పురోహితులు రాజేష్ జోషి మాట్లాడుతూ, రాత్రివేళ జరిగే లింగోద్భవ కాల అభిషేకంలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్ పల్లి శ్రీ రాజరాజేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఆదివారం కూడా వైభవంగా కొనసాగనున్నాయి. ఆదివారం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం వరకు నిరంతర అభిషేకాలు, ఉదయం 9:30 గంటలకు ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఉపవాస దీక్షల విరమణ అనంతరం భక్తులకు ఫలప్రసాదాలు పంపిణీ చేయనున్నారు. ముఖ్యంగా ఆదివారం రాత్రి 10:30 గంటలకు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం అత్యంత వేడుకగా జరగనున్నాయి. సోమవారం ఉదయం 6:30 గంటలకు పల్లకి సేవతో ఈ వేడుకలు ముగియనున్నాయి. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# మెట్లచిట్టాపూర్‌లో పుల్వామా వీరులకు శ్రద్ధాంజలి

● **బీఎస్ఎఫ్ జవాన్ గోపాలకృష్ణకు ఘన సన్మానం**





**మెట్‌పల్లి, నేటి సాక్షి రాధారపు నర్సయ్య:** పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవానులను స్మరించుకుంటూ మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం భావోద్వేగపూరిత వాతావరణంలో నివాళులు అర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఈ ఘోర దుర్ఘటనకు ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా, పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు కలిసి అమర జవానుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, అమరుల త్యాగాలను స్మరిస్తూ దేశభక్తి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ (BSF) జవాన్ గోపాలకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు కలిసి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గోపాలకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికులు ఎదుర్కొనే సవాళ్లను, దేశ రక్షణలో వారి కీలక పాత్రను వివరించారు. ప్రతి విద్యార్థి దేశభక్తిని, క్రమశిక్షణను అలవర్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణ గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుల్వామా అమరుల త్యాగస్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. శ్యామ్, శేఖర్, తేజ, సాయి, రాము, బన్నీ, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అంబేద్కర్ గురుకుల పాఠశాలకు రెగ్యులర్ వార్డెన్ నియమించాలి..





● **సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు..**

**నేటి సాక్షి జూపాడుబంగ్లా :** సంవత్సర కాలం నుండి జూపాడు బంగ్లా అంబేద్కర్ గురుకుల పాఠశాలకు రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే జిల్లా కలెక్టర్ గారు దృష్టి కేంద్రీకరించి రెగ్యులర్ వార్డెను నియమించాలని లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు హెచ్చరించారు. శనివారం సిపిఐ మండల నాయకులు మక్బూల్ బాషా, తిరుపతయ్యలతో కలిసి పాఠశాల డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ గురుకుల పాఠశాల జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి విద్యార్థులు చదువుకోవడానికి వస్తారని అయితే వారికి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని వారన్నారు వార్డెన్ ఉంటే అన్ని రకాల వసతులతో పాటు కూరగాయలు, మౌలిక సదుపాయాలు సమస్యలు కూడా చూసుకుంటారని టీచర్స్‌కి వార్డెన్ బాధ్యతలు అప్పగించడం వల్ల అటు వారు చదువు చెప్ప లేక విద్యార్థులకు భోజన వసతి మీద దృష్టిపెట్టలేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.. 600 మంది విద్యార్థులకు వార్డెన్ లేకపోతే ఏలా అని వారు ప్రశ్నించారు.. తక్షణమే విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు భోజన సక్రమ వసతులు కల్పించేందుకు రెగ్యులర్ వార్డె ను నియమించాలని దీనివల్ల అవకతవకలకు చోటు ఉండదు అన్నారు. విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. వారు కోరారు లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు..

# శివరాత్రికి ముస్తాబ్ అవుతున్న

**శ్రీ మృత్యుంజయ స్వరాలయం**

**స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన**

**మాజీ సర్పంచ్ గాజుల పద్మావతమ్మ కుటుంబ సభ్యులు**





**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** చౌడేపల్లి మండల కేంద్రంలో వెలిసిన శ్రీ అభీష్టత మృతుంజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబ్ అవుతోంది. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు మాజీ సర్పంచ్ శ్రీమతి గాజుల పద్మావతమ్మ కుటుంబ సభ్యులు శిరీష రాధాకృష్ణన్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు పూజా సామాగ్రి తోమాలలు విభూది లింగాలను ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులకు అందజేశారు ప్రతి సంవత్సరం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలతో పాటు పూజా సామాగ్రి విభూది లింగాలు తోమాలను అందజేయడం ఆనవాయితీగా వస్తుందని శిరీష రాధాకృష్ణ తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు

# మహాశివరాత్రికి ముస్తాబైన

**భవని చంద్రమౌళీశ్వర ఆలయం**





**నేటి సాక్షి తొగుట.. వడ్డే నరసింహులు:** మహాశివరాత్రి ఉత్సవాలకు సర్వంగా సుందరంగా ముస్తాబైంది కూడవెళ్ళివాగు తీరాన రాంపూర్ లో శ్రీ భవానీ చంద్రమౌలేశ్వర ఆలయం వెలిసింది ఆలయంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ఏర్పాట్లు పూజా కార్యక్రమాలు చేపట్టారు. – ప్రత్యేక ఏర్పాట్లు శివరాత్రి రోజున వేలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున క్యూ లైన్లు, భద్రత ఏర్పాటు సిద్ధం చేశారు పూజా కార్యక్రమాలు: మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచి అభిషేకాలు, విశేష పూజలు, రాత్రి జాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.ప్రాముఖ్యత: ఈ ఆలయంలో శ్రీ భవాని చంద్రమౌళీశ్వర స్వామి స్వయంబుగా కొలువై ఉన్నాడని, ఇక్కడ స్వామివారిని పూజిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయని నమ్ముతారు.

# నులిపురుగుల నివారణే లక్ష్యం..

**పోస్టర్లను విడుదల చేసిన ఎంపిడిఓ.. గోపీకృష్ణ,**



**నేటి సాక్షి జూపాడుబంగ్లా :** జూపాడుబంగ్లా మండల కేంద్రంలో నీ.. ఎంపిడిఓ ఆఫీసు నందు నులిపురుగుల పోస్టర్లను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు . నులిపురుల ఆల్బెండజోల్ పోస్టర్లను ఎంపిడిఓ గోపీకృష్ణ విడుదల చేశారు. 1నుండి 19సంవత్సరాలు వయస్సు ఉన్న పిల్లలందరికీ తప్పనిసరిగా వారందరికీ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా పీహెచ్సీసి డాక్టర్ సభ పేర్కొన్నారు. 17వ తేదిన పిల్లలకు అందరికీ మాత్రలు పంపిణీ చేస్తారని ఆరోజు తీసుకొని వారికి 24 వ తేదీ మరోసారి పంపిణీ చేస్తామని సూపర్వైజర్స్ రాముడు, విజయలక్ష్మి తెలియజేశారు. అనంతరం నులిపురుగుల నివారణ, జాగ్రత్తలను సూచించే గోడ పత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం లో ల్యాబ్ టెక్నిషియన్ చెంచన్న, ఏఎన్ఎంలు శ్రీలత, నాగ జ్యోతి ఆశలు పాల్గొన్నారు.

# జర్నలిస్టు జన్మదిన వేడుకలు

మెరుగు చంద్రమోహన్



**నేటి సాక్షి,కుషాయిగూడ:** సీనియర్ జర్నలిస్టు మెరుగు చంద్రమోహన్(సీఎం) జన్మదిన వేడుకలు శనివారం కుషాయిగూడలోని శ్రీరామ్ బ్రేకర్స్ అండ్ స్వీట్స్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు జన్మదిన వేడుకలకు హాజరై కేకు కట్ చేయించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి, డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్, బిఆర్ఎస్ నాయకుడు గంప కృష్ణ గుప్తా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి అంకితభావంతో పనిచేస్తున్న చంద్రమోహన్ సేవలను ప్రశంసించారు. "నిజాయితీ, నిబద్ధత, ప్రజా పక్ష ధోరణి కలగలిపిన జర్నలిజం అంటే మెరుగు చంద్రమోహన్ ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. పలువురు రాజకీయ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, సహచర జర్నలిస్టులు, సామాజిక వేత్తలు ఈ వేడుకలకు హాజరై కేకు కట్ చేయించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా విలువలతో కూడిన జర్నలిజాన్ని కొనసాగిస్తూ యువ పాత్రికేయులకు మార్గ దర్శకుడిగా నిలిచిన వ్యక్తి చంద్రమోహన్ గారు. కష్టసుఖాల్లో సహచరులకు అండగా నిలిచే స్వభావం ఆయనది. వార్తలను కేవలం ప్రచురించడం కాదు, సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. కేక్ కటింగ్ అనంతరం అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.కార్యక్రమం ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు తన్నీరు శ్రీనివాస్, వాసు, బెలిదే అశోక్,శనిగరం అశోక్, వెంకట్, కీర్తి శ్రీనివాస్, యవాపురం రవి, పటేల్ నరసింహ, ఆంజనేయులు, యాట రాజు, రవి యాదవ్, రియాజ్, వెంకటాపురం రవి, నరసింహ, రామచంద్ర మూర్తి, బాలకృష్ణ గౌడ్, సింగం రాజు, నరేష్, దొమ్మాటి కిరణ్ కుమార్, మోహన్ రెడ్డి, హుస్సేన్, చిత్తారి, విష్ణు మోహన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# నిఘా నీడలో మహాజాతర

175 సీసీ కెమెరాలతో కట్టుదిట్టమైన పర్యవేక్షణ.



**నేటి సాక్షి,:**రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరుగుతున్న మహాజాతర సందర్భంగా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రాంగణంతో పాటు పట్టణ కేంద్రంలోని కీలక ప్రాంతాల్లో మొత్తం 175 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్□కు అనుసంధానం చేసి జాతర ప్రాంగణం, ట్రాఫిక్ రద్దీ, క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తిన వెంటనే కమాండ్ కంట్రోల్ నుండి వైర్లెస్ సెట్ ద్వారా సంబంధిత సిబ్బందికి సమాచారాన్ని చేరవేస్తున్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం చేసుకునేలా, అలాగే అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

# బాలల హక్కుల ఉల్లంఘనకు

పాల్పడితే కఠిన చర్యలు:

అంగన్‌వాడీ టీచర్‌పై కేసు నమోదు




**నేటి సాక్షి సిరిసిల్ల:** వెంకటాపూర్ రెండో అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిపై టీచర్ దాడి చేసిన ఘటనపై జిల్లా సంక్షేమ యంత్రాంగం మరియు పోలీసులు కఠినంగా స్పందించారు. బాలుడిపై దాడి జరిగిన సమాచారం అందుకున్న వెంటనే జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ జాజాల రాణిని విచారించగా, తాను బాలుడిని కొట్టినట్లు ఆమె అంగీకరించింది. జరిగిన ఘటనపై అధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టినందుకు ఆమెను తీవ్రంగా మందలించారు. పోలీసుల సూచన మేరకు ఈ ఉదంతాన్ని 'మెడికో లీగల్ కేసు'గా పరిగణించి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో బాలుడికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన చికిత్స కోసం బాలుడిని సిరిసిల్లలోని ఎల్వీ ప్రసాద్ ప్రాంతీయ ఆసుపత్రి మరియు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి నిపుణులైన పిల్లల వైద్యులు, ఈఎన్‌టీ (జుచీ), కంటి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ప్రస్తుతం బాలుడికి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందుతోంది. ఈ ఘటనపై పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ జాజాల రాణిపై ఎఫ్ఐఆర్ నెంబర్ 36/2026 కింద భారత న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 118(1)తో పాటు, బాలల న్యాయ చట్టం (జీబ-జవఅఱశ్రీవ జీబర్‌అఎవ-ూఖ్) సెక్షన్ 75 ప్రకారం కేసు నమోదు చేశారు. బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే కఠినమైన జైలు శిక్షలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదని స్పష్టం చేశారు.

# "బాల్య వివాహ రహిత భరత్"..పై విద్యార్థులకు అవగాహన






- బాల్యవివాహాల నిర్మూలనకు చదువే ఆయుధం : సి.డబ్ల్యూ.సి చైర్మన్ చింత కృష్ణయ్య

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** సమాజంలో చిన్నారుల బాల్య వివాహాలు నిర్మూలించాలని, వాటిని నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి చదువే ఆయుధం అని సి.డబ్ల్యూ.సి చైర్మన్ చింత కృష్ణయ్య అన్నారు. అర్బన్ సీడీపీఓ రేఖల మమత ఆదేశాల మేరకు శనివారం అవంతిపురం జంగాల కాలనీ, మరియు తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ స్కూల్ మిర్యాలగూడలో అంకూర్ మీడియా వారి సమక్షంలో "బాల్య వివాహ రహిత భరత్" 100 రోజుల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సి.డబ్ల్యూ.సి చైర్మన్ చింత కృష్ణయ్య మాట్లాడుతూ, బాల్యం అనగా తల్లి గర్భంలో శిశువు దశనుండి 18 సంవత్సరాలు నిండే వరకు భాల్యం అంటారని, ఆ బాల్యంలో పిల్లలు అందరూ చదువుపైనే శ్రద్ధ చూపాలని, ఆడపిల్లలు అన్నిరంగాలలో ముందుండాలంటే, చదువును మధ్యలో ఆపివేయొద్దని, ఎక్కడైనా ఎవరికైనా బాల్యవివాహాలు జరిపిస్తున్నట్లు తెలిసి వెంటనే 1098 కు సమాచారం అందించాలని వివరించారు.ఈ యొక్క కార్యక్రమంలో మైనారిటీ స్కూల్ ప్రిన్సిపల్ అరుణ కుమారి, అంకుర్ మీడియా కో-ఆర్డినేటర్ గౌరీ శంకర్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ లీగల్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకన్న, అవంతి పురం సర్పంచ్ సుజాత సురేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్స్ నాగమణి, రాధిక, మహిళా శక్తి సాధికారత శ్రీదేవి,యువశక్తి యన్. జీ. ఓ ప్రెసిడెంట్ మల్లేష్ యాదవ్, రమణి, అంగన్వాడీ టీచర్స్ సువర్ణ, వసుమతి, అంజలి దేవి, సుజిత, మైనారిటీ స్కూల్ యాజమాన్యం, స్కూల్ విద్యార్థులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మురిసిన జ్ఞాపకాలు.. గురువులకు ఘన సన్మానం






- తిరుమలాయపాలెంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**నేటి సాక్షి తిరుమలాయపాలెం, రుద్రరాజు:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం 1994-95 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. సుమారు 31 ఏళ్ల తర్వాత పాఠశాల నాటి మిత్రులందరూ ఒకే వేదికపైకి చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితాలకు దిశానిర్దేశం చేసిన గురువులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతా భావాన్ని చాటుకున్నారు. తమ ఎదుగుదలలో గురువుల పాత్ర అనిర్వచనీయమని, ఈ ఆత్మీయ సమ్మేళనం పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడమే కాకుండా మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులు కూడా పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు ఆళ్ల రామారావు, సత్యనారాయణ, ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడటం గర్వకారణంగా ఉందన్నారు. ఇలాంటి కలయికలు తరాల మధ్య అనుబంధాన్ని మరింత బలపరుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఈ బ్యాచ్ విద్యార్థులందరూ ఒక కమిటీగా ఏర్పడి పాఠశాల అభివృద్ధికి, సమాజ సేవకు స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పదముత్తు అజరయ్య, నూకతొట్టి సల్మాన్ రాజు, వీరన్న, సైదమ్మ, కొమ్ము నాగేశ్వరరావు మరియు వివిధ గ్రామాలకు చెందిన నాటి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోజంతా కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు.

# 'టాప్ 30' పాఠశాలల్లో మన 'ప్రతిభ హై స్కూల్'కు స్థానం!




- మరికల్ ప్రతిభ హైస్కూల్ గర్వకారణం....
- పాఠశాల కరస్పాండెంట్ హనుమంత్ రెడ్డికి ఘన సన్మానం......

**నేటి సాక్షి,నారాయణపేట్ ఇమామ్ సాబ్:** భారతదేశ వ్యాప్తంగా ఉన్న సుమారు 30,000 సీబీఎస్ఈ (జదీూజు) అనుబంధ పాఠశాలల నుంచి, విద్యా ప్రమాణాల ప్రాతిపదికన ఎంపిక చేసిన అత్యుత్తమ 30 పాఠశాలల్లో మన ప్రతిభ హై స్కూల్ ఒకటిగా నిలవడం మనందరికీ గర్వకారణం. విద్యా రంగంలో వినూత్న మార్పులు తీసుకొస్తూ, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు గాను... మన పాఠశాల చైర్మన్ శ్రీ టి. హనుమంత్ రెడ్డి గారిని ఈ ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. శనివారం నాడు మహారాష్ట్రలో జరిగినటువంటి 'భారత్ భూషణ్ సన్మాన్ 2.0 వేడుకలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు "విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకూడదు, అది ఒక బిడ్డ జీవితాన్ని మార్చే మహా శక్తిగా ఉండాలి" అనే ఆశయంతో అహర్నిశలు కృషి చేస్తున్న చైర్మన్ శ్రీ హనుమంత్ రెడ్డి సార్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# బండి సంజయ్‌కు అంత డబ్బు ఎక్కడిది?

- పుస్తెలమ్ముకున్నానని చెప్పిన వ్యక్తి.. అభ్యర్థులకు లక్షలాది రూపాయలు ఎలా ఇచ్చారు?
- ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ ప్రశ్న
- కరీంనగర్‌లో ఘనంగా ఎంఐఎం 68వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**నేటి సాక్షి కరీంనగర్:** గత అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య పుస్తెలమ్మితేనే పోటీ చేశానని చెప్పుకున్న బండి సంజయ్‌కు, ఈ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పంచడానికి లక్షలాది రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ప్రశ్నించారు. శనివారం నగరంలోని ఎంఐఎం కార్యాలయంలో పార్టీ 68వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ధర్మం కోసం, దేశం కోసం అని నినదించే బండి సంజయ్.. మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థికి లక్షలాది రూపాయలు ఇచ్చి గెలవడానికి ప్రయత్నించారని, ఈ విషయాన్ని కరీంనగర్ ప్రజలు గమనించాలని ఆయన కోరారు. కుల, మత విభేదాలు సృష్టించి బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. దేశంలో పీడిత, తాడిత వర్గాల కోసం, ముఖ్యంగా దళితులు, ముస్లింల హక్కుల కోసం పార్లమెంటులో గొంతెత్తేది కేవలం తమ అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ మాత్రమేనని స్పష్టం చేశారు.

**ఓటమిపై సమీక్ష.. ప్రజల పక్షాన పోరాటం**

కరీంనగర్ కార్పొరేషన్‌లో ఎంఐఎం పార్టీని ఆదరించి ఓటేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాని డివిజన్లపై క్షేత్రస్థాయిలో విశ్లేషణ చేస్తామన్నారు. "ఓటమిని గుణపాఠంగా తీసుకుంటాం.. లోపాలను సరిదిద్దుకుని ప్రజా సమస్యలపై రెట్టింపు ఉత్సాహంతో పోరాడతాం" అని హుస్సేన్ అన్నారు. పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు త్వరలోనే కొన్ని డివిజన్ కమిటీలను మార్చి, నూతన కమిటీలను నియమిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ముగ్గురు ఎంఐఎం కార్పొరేటర్లను పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, కార్పొరేటర్లు మొహసీన్ మొహియుద్దీన్, ఇబ్రహీం మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# కోరుట్ల 'బల్దియా చైర్'పర్సన్ ఎవరు!?

## రేసులో 'నలుగురు ఆశావాహులు?

**తెరపైకి మరో 'రెండు కొత్త పేర్లు'!**

- 'కింగ్ మేకర్' ఓటు.. 'అనుచరుడి'కా? 'అణకువుడి'కా.? 'ఆర్థిక బలుడి'కా? 'ఆది బంధువు'కా?.. 'ఆదరణుడి'కా? 'అగర్భ కాంగ్రెస్‌వాది'కా?
- 'జువ్వాడి'కి 'నే'తలనొప్పి'గా మారిన 'చైర్ పర్సన్' ఎంపిక!
- తేల్చేందుకు 'రాజధాని'లో 'క్యాంప్' ఫైర్?





నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)

"కోరుట్ల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన 'మ్యాజిక్ ఫిగర్' రావడంతో.. ఇప్పుడు అందరూ 'బల్దియా చైర్'-పర్సన్ ఎవరవుతారని తెగ చర్చించుకుంటున్నారు.! 'పట్టాభిషేకం' రేసులో 'నలుగురు ఆశావాహులు.? నాకే దక్కుతుందని ఎవరికి వారే పావులు కదుపుతున్నారు.వీరిలా తమ ప్రయత్నాలు తాము చేసుకుంటుండగానే..'బల్దియా' తెరపైకి మరో 'రెండు కొత్త పేర్లు' వచ్చాయి. ఇందులో గత 15 రోజుల నుంచే 'తగు ఏర్పాట్లు' చేసుకుని మరీ 'రంగం'లోకి దిగినట్టు తెలియవచ్చింది.ఇక చివరగా ఓ 'ట్విస్ట్' చోటుచేసుకుని 'హలో'.!..నేనూ రేసులోనే ఉన్నాను..30 ఇయర్స్ ఇండస్ట్రీ ఇక్కడ అంటూ ఫలితం వెలువడిన కాసేపటి నుంచి అనూహ్యంగా తెరపైకి దూసుకొచ్చారు.దీంతో.. ఈ యవ్వారం అంత 'జువ్వాడి'కి.. నే'తలనొప్పి'గా మారిందని చర్చించుకుంటున్నారు. ఇది అంత ఈజీగా ఒడిసేలా లేదని 'తాడో-పేడో' తేల్చేందుకు.. రాష్ట్ర రాజధానిలో 'క్యాంప్-ఫైర్' రాజకీయ సమీకరణాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.మరి..మన 'కింగ్ మేకర్' ఓటు.. 'అనుచరుడి'కా.?.. 'అణకువుడి'కా.?..'ఆర్థిక బలుడి'కా.?..'ఆది బంధువు'కా.?.. 'ఆదరణుడి'కా.?..'అగర్భ కాంగ్రెస్ వాది'కా.? అన్నది కోరుట్ల రాజకీయ పరిజ్ఞానులు విశ్లేషించుకుంటున్నారు.!"

### ఎప్పట్నుంచో.. రేసులో 'ఆ-ఐదుగురు'.!

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన నాటి నుంచే 'రిజర్వేషన్'కు అనుకూలంగా టికెట్లు దక్కించుకునేందుకు 'ఖరీదైన' యుద్ధమే చేశారని బయట టాకు.! సదరు ఆశావాహులైన 'చైర్ పర్సన్'గా కూర్చుని అర్హత గల కౌన్సిలర్ అభ్యర్థుల భర్తలు.. అన్నం అనిల్.. శీలం వేణుగోపాల్ .. తిరుమల గంగాధర్..ఆడెపు మధు.. పుప్పాల ప్రభాకర్'లు 'చైర్మెన్' కుర్చీపై ఆశతోనే.ఆ స్థాయిలో ఖర్చు పెట్టుకుని మొత్తానికి 'విజయం' దక్కించుకున్నారు.! ఇందులో దాగివున్న 'ట్విస్ట్' ఏంటంటే..'ఆ-ఐదుగురి'లో ఎవరైనా ఓటమి చెందినా? లేక వారికున్న 'వ్యతిరేకత' వల్ల ఓడిపోయినా.? 'నేనున్నాను..' మీ వెనుకే అంటూ మరో కొత్త 'అర్హత గల్ల ఆశావాహుడు'.. టీవీశేఖర్ ఒక్కసారిగా ప్రచారం జరుగుతుండగానే పనిలోపనిగా ఇదీ తెరపైకి తెచ్చుకున్నట్టు వినిపించింది.! కాగా, అదంతా అలా ఉంచితే.. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్దిసేపటికే సమీకరణాలు అనూహ్యంగా మారిపోయాయి.మీ అందరితో పాటు.. అసలు మీకంటే 'నేనే' అసలు సిసలు 'కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిని' అంటూ 'సోగ్రాభీ' చైర్ పర్సన్ రేసులోకి దూసుకురావడంతో..ఆశ్చర్యపోవడం సదరు 'ఆశావాహుల'వంతైనట్టు విశ్వసనీయ సమాచారం. 'కింగ్ మేకర్'దృష్టిలో 'ఆ-శివగామి' ఎవరో..మరి.? అని ముచ్చటించుకుంటున్నారు.!

### ఆపత్కాలంలో 'అనుచరుడాయన'.!

'తిరుమల గంగాధర్'.. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు.! 13వ వార్డు నుంచి 2019 లో తన సతీమణి 'తిరుమల వసంత'ని బరిలోకి దించి కౌన్సిలర్ గా గెలిపించుకున్నారు.ఐదేళ్లు అటు 'మున్సిపాలన'లో..ఇటు 'పార్టీ పట్టణాధ్యక్షులు'గా 'జువ్వాడి బ్రదర్స్'కి చేదోడు వాదోడుగా నిలిచారు.ఒకదశలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా 'వారివెన్నంటే' ఉన్నారు. అయితే..విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీలో కొనసాగినప్పటికీ..ఓ రెండేళ్లు 'టీఆర్ఎస్' పార్టీలో చేరారు.వెంటనే 'తన బాస్' ఎక్కడుంటే తానే అక్కడే అని జువ్వాడికి ముఖ్య అనుచరుడిగా ముద్ర వేసుకున్నారు.!

### 'అణకువే.. ఆయనకు 'ఆభరణం'.!

అవసరమై వచ్చినా.? ఆపదుండి వచ్చినా.? ఆకలితో వచ్చినా.? 'అన్నం' పెట్టేందుకు ఎప్పుడూ ముందుండేవాడు 'అనిల్'.! తన రాజకీయ అరంగేట్రం 'తెలుగుదేశం' పార్టీతో మొదలైంది. మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ముఖ్య అనుచరుడుగా.. కోరుట్లలో అత్యంత సన్నిహితుడిగా 'గుర్తింపబడ్డాడాయన'.! ఆ సాన్నిహిత్యంతో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పదవినలంకరించారు. ఆ తర్వాత 26వ వార్డు కౌన్సిలర్ గా ఆయన సతీమణి 'అన్నం లావణ్య'ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసి 'మున్సిపల్ చైర్ పర్సన్' బాధ్యతలనూ అప్పగించారు.అటు తండ్రితో..ఆ తర్వాత ఎమ్మెల్యే అయిన తనయుడు డాక్టర్ సంజయ్'తోనూ అత్యంత కీలక నేతగా స్టాంపువేసుకున్నడు. అయితే .! కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో.. అభివృద్ధి కోసం అతను..తన దగ్గరి మిత్రులను కలుపుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో 'కాంగ్రెస్' పార్టీలో చేరారు.వారి ఆశీస్సులతో.. 'జువ్వాడి బ్రదర్స్'కి ముఖ్యమైన 'పవర్ సెంటర్' నేతగా మారి కోరుట్లలో కీలక నేతగా ఆవిర్భవించారు.!

### 'ఆర్థిక-బాహుబలీయన'.!

కోరుట్ల మున్సిపాలిటీ రాజకీయ నేతల్లో అత్యంత ఆకర్షణీయమైన రూపున్న నేతగా గానీ.. ఎంతైనా ఖర్చుపెట్టగల 'ఆర్థిక బాహుబలి' అంతటి ఐశ్వర్యవంతుడని 'శీలం వేణుగోపాల్'కి ఓ బ్రాండ్ నేమ్ ఉంది.! కోరుట్ల పట్టణంలో 'తొలినాటి 'రాజకీయ దురంధరుల్లో కీలక నాయకుడాయన. అప్పుడే ఓ రేంజ్ ఆటాడుకున్న కరుడుగట్టిన కాంగ్రెస్ ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఒకడు. ఆ తర్వాత వ్యాపారరంగంలో అంచెలంచెలుగా ఎదిగి..మళ్లీ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆయన సతీమణి 'శీలం జయలక్ష్మి'ని 24వ వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలిపించుకుని 'టిఆర్ఎస్ పార్టీ' హయాంలో 'చైర్ పర్సన్'గా కూడా 'మున్సి-పాలన' అందించాడాయన.కొన్ని అనివార్య కారణాల వల్ల 'బిఆర్ఎస్ టు బీజేపీ'లోకి వెళ్లి అనతికాలంలోనే తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఇప్పుడు మరోసారి బరిలోకి దిగి ఉత్కంఠ భరితమైన పరిస్థితుల్లో 'ఘన విజయం' సాధించి మరోసారి 'పట్టాభిషేకం' రేసులో ఉన్నాని 'క్యాంప్' చర్చల్లో కూర్చున్నారు.

### 'ఆది' బంధువు-పెద్దాయన శిష్యుడు

కోరుట్ల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా అందరికీ చిరపరిచితుడు 'పుప్పాల ప్రభాకర్'.! స్వర్గీయుడు జువ్వాడి రత్నాకర్ రావుకు ప్రియ శిష్యుడు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న ఆయన హయాంలో పుప్పాల ప్రభాకర్ ఆలయ చైర్మన్‌గా ఓ వెలుగు వెలిగారు. ఆ తర్వాత వచ్చిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సతీమణి 'పుప్పాల ఉమాదేవి'ని 23వ వార్డు కౌన్సిలర్‌గా గెలిపించుకున్నారు.కొంతకాలం బీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ.. మళ్లీ కాంగ్రెస్‌లోకి తిరిగి చేరుకున్నారు. ఈసారి కూడా అదే వార్డు నుంచి కౌన్సిలర్ గా గెలుపొంది 'చైర్ పర్సన్'గా పట్టాభిషేకానికి ఉవ్విళ్లూరుతున్నారు.ఇందుకుగాను తన సమీప బంధువైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అండదండలు పుష్కలంగా ఉండడంతో తన ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు.!

### అ'దృశ్య' ఆదరణీయుడు!

కోరుట్ల మున్సిపాలిటీ రాజకీయ తెరపైకి అనూహ్యంగా వచ్చి.. సమాజంలో మంచి ఆదరణీయుడిగా పేరు సంపాదించుకున్నడు.. 'టీవీ శేఖర్'.! టీవీ రిపేర్ రంగంలో గానీ.. రియల్ ఎస్టేట్ రంగంలో గానీ..పేరు ప్రఖ్యాతులు 'సంపాదించుకున్న' ఆయన రాజకీయ రంగంలో కూడా ఎదుగుతున్న నేతగా గుర్తింపు పొందారు. బీజేపీ నుంచి తన సతీమణి 'దాసరి సునీత'ను 11వ వార్డులో కౌన్సిలర్ గా గెలిపించుకున్నారు. ఆ తర్వాత 'అన్నం అనిల్' సహచర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి మారి 'జువ్వాడి బ్రదర్స్'కి అత్యంత సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు.ఈసారి 11వ వార్డులో తన సతీమణి 'దాసరి సునీత'ను.. మళ్లీ గెలిపించుకుని.. 12వ వార్డులో తాను పోటీ చేసినప్పటికీ విజయం వరించలేదు.కానీ..తన సతీమణిని 'చైర్ పర్సన్'గా కూర్చోబెట్టేందుకు అనూహ్యంగా తెరపైకి వచ్చారు.

### 'ఆమె.. రాజకీయ ప్రస్థానం 30 ఇయర్స్ ఇండస్ట్రీ.!

ఇప్పుడు ఈ పేరు ఎవరూ ఊహించనిది.! కాంగ్రెస్ పార్టీలో 30 ఏండ్లుగా నిరంతరంగా కొనసాగుతున్న సొగ్రబీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆరు సార్లు ఎన్నికల బరిలో నిలిచి, నాలుగు సార్లు కౌన్సిలర్‌గా ఎన్నికవడం ఆమె రాజకీయ ప్రయాణానికి నిదర్శనం.






అందులో మూడు సార్లు హ్యాట్రిక్ విజయం సాధించడం విశేషం. గెలిచిన ప్రతి సందర్భంలోనూ 300కి పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించడం ఆమె ప్రజాదరణను చాటుతోంది.ఓడిన రెండు సందర్భాల్లో కూడా కేవలం 50 ఓట్ల తేడాతోనే పరాజయం చెందడం స్థానికుల దృష్టిలో ఆమెకు ఉన్న బలాన్ని సూచిస్తోంది. తెలంగాణలో రెండు సార్లు టీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ, ఆ పరిస్థితుల్లో కూడా గట్టి పోటీ ఇచ్చిన నాయకురాలిగా ఆమెను అనుచరులు ప్రస్తావిస్తున్నారు.సొగ్రబీ రాజకీయ జీవితంలో ఆర్థిక లాభాలకంటే ప్రజాసేవకే ప్రాధాన్యం ఇచ్చిందనే అభిప్రాయం కోరుట్ల ప్రజల్లో విస్తృతంగా ఉంది. పదవుల కోసం కాకుండా, పార్టీ కోసం, ప్రజల కోసం నిరంతరంగా కృషి చేసిందని అనుచరులు చెబుతున్నారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉంటూ సేవలందించడం ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చింది. స్థానిక స్థాయిలో సమస్యల పరిష్కారం, వార్డుల అభివృద్ధి, ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం వంటి అంశాల్లో ఆమె చురుకుదనం ప్రస్తావనీయమని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ నిర్వహించే ప్రతి సమావేశంలో జువ్వాడి బ్రదర్స్ ప్రసంగాల్లో సొగ్రబీ సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం.'మా నాన్న జువ్వాడి రత్నాకర్ రావు నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ సొగ్రబీ ఎనలేని సేవలు అందించారు' అంటూ ఆమె అనుభవాన్ని గుర్తు చేస్తుండటం ఆమెకు పార్టీలో ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోంది. పార్టీ పట్ల అంకితభావంతో కొనసాగిన నాయకురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు ఇప్పుడు చైర్మన్ రేసులో కీలకంగా మారింది.!

### అనుభవానికా... ప్రయోగానికా?

ఈ సారి కోరుట్ల మున్సిపల్ చైర్-పర్సన్ పదవి 30 ఏళ్ల రాజకీయ అనుభవానికి, నిరంతర ప్రజాసేవకు పట్టం కడతారా? లేక పార్టీ మార్పుల రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తారా? అన్న ప్రశ్నపై పట్టణం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.! అనుభవానికి విలువ ఇస్తారా.? లేక కొత్త ప్రయోగాలకు అవకాశం కల్పిస్తారా? అనే అంశం చర్చకు దారితీసింది.తుది నిర్ణయం ఎలా ఉండబోతుందో, కోరుట్ల రాజకీయాల్లో కొత్త అధ్యాయం ఎవరి చేతిలో రాయబడుతుందో చూడాల్సిందే.! కోరుట్ల మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరికీ దక్కినా, పట్టణ అభివృద్ధి, ప్రజల ఆకాంక్షల నెరవేర్పే ప్రధాన లక్ష్యమవ్వాలని ప్రజలు ఆశిస్తున్నారు.!!